RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -355 పేజీలు - 08 వెల - 04/- ఆదివారం 23 నవంబర్ 2025




# సత్యసాయి సేవలు చిరస్మరణీయం

## రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు

**పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు**

**మానవ సేవే మాధవ సేవ అని బాబా చాటారన్న ముర్ము**

**బాబా బోధనలు ప్రపంచ శాంతికి దోహదపడతాయన్న సీఎం**

**మానవ సేవలో సత్యసాయి ట్రస్ట్ ఆదర్శనీయమన్న నేతలు**

**ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ కార్యక్రమం ప్రారంభం**

**పుట్టపర్తి నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**

శ్రీ సత్యసాయి బాబా నిరంతరం బోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ వంటి మార్గాలు అనుసరణీయమని, లోక కల్యాణం కోసమే ఆయన పాటుపడ్డారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. పుట్టపర్తిలో జరుగుతున్న సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో కలిసి ఆమె సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అంతకుముందు విమానాశ్రయంలో రాష్ట్రపతికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. మిగతా 2లో...



# ప్రపంచ అభివృద్ధికి మోదీ కొత్త దారి!

**జీ20 వేదికగా ప్రధాని మోదీ 4 కీలక ప్రతిపాదనలు..**




**జీ20 సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగం**

**సాంప్రదాయ విజ్ఞానం కోసం 'గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపాజిటరీ' ఏర్పాటుకు సూచన**

**ఆఫ్రికాలో 10 లక్షల మంది శిక్షకుల తయారీకి ప్రత్యేక కార్యక్రమం**

**డ్రగ్స్-టెర్రర్ నెట్‌వర్క్‌పై ఉమ్మడి పోరుకు ప్రపంచ దేశాలకు పిలుపు**

**ఆరోగ్య అత్యవసర సేవల కోసం గ్లోబల్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటుకు ప్రతిపాదన**

జొహాన్నెస్‌బర్గ్**నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**

దక్షిణాఫ్రికాలోని జొహాన్నెస్‌బర్గ్‌లో శనివారం ప్రారంభమైన జీ20 దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచానికి సరికొత్త మార్గాన్ని నిర్దేశించారు. ప్రారంభ సెషన్‌లో ప్రసంగించిన ఆయన.. ప్రపంచ అభివృద్ధి ప్రమాణాలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. సమ్మిళిత, సుస్థిర వృద్ధి లక్ష్యంగా పలు కీలకమైన, వినూత్నమైన నాలుగు కార్యక్రమాలను ప్రతిపాదించారు. ఆఫ్రికా ఖండం తొలిసారిగా జీ20 సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న తరుణంలో, అభివృద్ధికి కొత్త నిర్వచనం ఇవ్వడానికి ఇదే సరైన సమయమని ఆయన అభిప్రాయపడ్డారు. 'సమ్మిళిత, సుస్థిర ఆర్థిక వృద్ధి' అనే అంశంపై జరిగిన ఈ సెషన్‌లో మోదీ మాట్లాడుతూ, భారతదేశపు ప్రాచీన నాగరికతా విలువలు, ముఖ్యంగా ఏకాత్మ మానవతావాదం ) ప్రపంచానికి ఒక మార్గాన్ని చూపగలవని అన్నారు. అనంతరం తన ప్రసంగంలోని ముఖ్యాంశాలను 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. మిగతా 2లో...



## ఏపీలో మరో 11 కార్పొరేషన్లకు కొత్త చైర్మన్లు

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ**

**వివిధ సామాజిక వర్గాలకు, ప్రాంతాలకు ప్రాధాన్యత**

**పలు అభివృద్ధి, సంక్షేమ సంస్థలకు కొత్త సారథులు**

2లో.

### తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన

## 37 మంది మావోయిస్టులు...

**లొంగిపోయిన వారిలో కీలకనేత ఆజాద్**
**వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు**

**మిగిలిన 34 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మావోయిస్టులు**

**లొంగిపోయిన మావోయిస్టులు ఆయుధాలు అప్పగించినట్లు తెలిపిన డీజీపీ**

**నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**

తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిపై ప్రభుత్వం రూ. 1.41 కోట్ల రివార్డు ప్రకటించింది. మిగతా 2లో...



## పక్కపక్కనే జగన్, కేటీఆర్

**పక్కపక్కనే కూర్చుని ముచ్చటించుకున్న జగన్, కేటీఆర్**


**ఇద్దరు కలిసి ఫంక్షన్ హాలులోకి వస్తున్న వీడియోలు వైరల్**

**కేటీఆర్ చెబుతుంటే వింటూ కూర్చున్న జగన్**

బెంగళూరు **నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒకే వేదికపై కలుసుకున్నారు. బెంగళూరులోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో వీరిద్దరు పాల్గొన్నారు. పక్కపక్కనే కూర్చుని కాసేపు ముచ్చటించారు. కేటీఆర్ ఏదో చెబుతుండగా జగన్ వేడుకను తిలకిస్తూ విన్నారు.





## తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో అంతటి చైతన్యవంతులు : రేవంత్ రెడ్డి

**అందెశ్రీ సంతాప సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**కవులు, కళాకారులు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్న ముఖ్యమంత్రి**

**తెలంగాణ ప్రజలు అహంకారాన్ని, అధిపత్యాన్ని సహించలేరని వ్యాఖ్య**

## రైతులకు అన్యాయం జరగనివ్వం..

**సీఆర్డీఏ మీటింగ్ లో మంత్రి నారాయణ**

**సీఆర్డీఏ కార్యాలయంలో ఈరోజు సమావేశమైన త్రిసభ్య కమిటీ**

**రైతు జేఏసీ ప్రతినిధులు కూడా హాజరు**

**రైతులు లేవనెత్తిన అంశాలపై చర్చ**

**అమరావతినవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**

ప్రభుత్వంపై విశ్వాసంతో రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగనివ్వబోమని ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈమేరకు ఈ రోజు ఉదయం జరిగిన సీఆర్డీఏ సమావేశంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. రాజధాని రైతుల సమస్యల పరిష్కారంపై సీఆర్డీఏ కార్యాలయంలో కేంద్ర మంత్రి మిగతా 2లో...



## శ్రీ సత్యసాయి విద్యాసంస్థల క్రమశిక్షణ, విలువలు అమోఘం

**2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్**

**ప్రధాని వల్లే భారత్ గ్లోబల్ లీడర్: సీపీ రాధాకృష్ణన్**



2లో.



### పంచాయతీ ఎన్నికలకు

## లైన్ క్లియర్..

### రిజర్వేషన్లపై జీవో విడుదల

**గ్రామ పంచాయతీ ఎన్నికల**

**రిజర్వేషన్లపై ప్రభుత్వ జీవో**

**50 శాతానికి మించకుండా రిజర్వేషన్లు ఖరారు**

**రొటేషన్ పద్ధతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్లు**

**నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. సర్పంచ్‌లు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్ల విధివిధానాలను ఖరారు చేస్తూ కీలకమైన జీవోను విడుదల చేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు మిగతా 2లో...

## రైళ్లలో ముంబైకి రాయలసీమ అరటి

**అరటి, పత్తి, మొక్కజొన్న పంటలపై సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు**

**అరటి రైతులను ఆదుకునేందుకు ముంబైకి రైల్వే వ్యాగన్లు**

**పత్తి, మొక్కజొన్న రైతుల సమస్యలపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**ధరల స్థిరీకరణ నిధితో మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు**



**అమరావతి నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో అరటి, పత్తి, మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. ధరల పతనం, కొనుగోళ్లలో జాప్యం వంటి అంశాలపై ఆయన అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించి, రైతులను ఆదుకునేందుకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా రాయలసీమ అరటి రైతులు, రాష్ట్రవ్యాప్తంగా పత్తి, మొక్కజొన్న రైతులు నష్టపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మిగతా 2లో...

# సత్యసాయి సేవలు చిరస్మరణీయం




ఈ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. "సత్యసాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం నా భాగ్యం. 'మానవ సేవే మాధవ సేవ' అని నమ్మిన మహానుభావుల్లో ఆయన అగ్రగణ్యులు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ జాతి నిర్మాణం కోసం విశేష కృషి చేస్తోంది. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశం కోసం పనిచేయాలి" అని పిలుపునిచ్చారు. 1969 నుంచే మహిళా సంక్షేమానికి బాబా ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు.

**బాబా బోధనలు ప్రపంచ శాంతికి మార్గం: సీఎం చంద్రబాబు**

సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "'లవ్ ఆల్.. సర్వ్ ఆల్' అనేదే బాబా సిద్ధాంతమని, ఆయన ప్రవచించిన పంచ సూత్రాలు పాటిస్తే ప్రపంచం శాంతితో వర్ధిల్లుతుందని అన్నారు. "సత్యసాయి బాబాతో నాకు మంచి అనుబంధం ఉంది. తాగునీటి ప్రాజెక్టుల కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టడానికైనా ఆయన సిద్ధపడ్డారు. ఆయన స్ఫూర్తితో భక్తులు పెద్ద ఎత్తున విరాళాలిచ్చి ఆ ప్రాజెక్టులను పూర్తి చేశారు" అని గుర్తుచేసుకున్నారు. సత్యసాయి ట్రస్ట్ 140 దేశాల్లో 2 వేలకు పైగా శాఖలతో, 7.50 లక్షల మంది వాలంటీర్లతో సేవలందించడం అద్భుతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం'ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ం

సత్యసాయి బాబా తన సందేశాలతో చాలామందిలో పరివర్తన తెచ్చారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి సమస్య లేకుండా బాబా అనేక ప్రాజెక్టులు నెలకొల్పారు. విరాళాల రూపంలో వచ్చిన నిధులను ప్రాజెక్టుల నిర్మాణానికి వినియోగించారు. అనేక గ్రామాల్లో లక్షల మందికి తాగునీరు అందించారు. ఎన్నో వైద్యాలయాలు స్థాపించారు. సత్యసాయి ట్రస్టుకు లక్షల మంది వాలంటీర్లు ఉన్నారు. మానవ సేవే మాధవ సేవ అని నమ్మి సత్యసాయి ఆచరించారు. భగవాన్ సాయి సిద్ధాంతం ప్రపంచమంతా వ్యాపించింది. దాన్ని మనమంతా అర్థం చేసుకోవాలని చంద్రబాబు అన్నారు. లవ్ ఆల్.. సర్వ్ ఆల్, ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలని... ఎవ్వరినీ నొప్పించకూడదు అనేది సత్యసాయి బాబా సిద్ధాంతమని చంద్రబాబు నాయుడు అన్నారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా అనే ఈ ఐదు సూత్రాలను సత్యసాయి బాబా చెప్పేవారని గుర్తు చేశారు. సత్యసాయి బాబా చెప్పిన సిద్ధాంతాలు.. సూత్రాలను పాటిస్తే ప్రపంచం శాంతిగా ఉంటుందన్నారు. ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో తాగు నీటి సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు. తాగు నీటి ప్రాజెక్టు కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టాలని సత్యసాయి బాబా భావించారన్నారు. కానీ ఆయన అభిప్రాయాన్ని తెలుసుకున్న భక్తులు... పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి తాగు నీటి ప్రాజెక్టులకు నిధులను సమకూర్చారని ఆనాటి సంగతులను గుర్తుచేశారు. ఇప్పటికీ అదే స్ఫూర్తిని సత్యసాయి బాబా భక్తులు కొనసాగించడం తనకు సంతోషాన్ని ఇస్తోందన్నారు. సత్యసాయి బాబాతో తనకు మంచి అనుబంధం ఉందని సీఎం గుర్తుచేశారు. వివిధ ప్రాణాంతక రోగాల బారిన పడిన వారిని సత్యసాయి బాబా ట్రస్టు ఆదుకుంటోందని సీఎం పేర్కొన్నారు. మానవ సేవే... మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని సత్యసాయి బాబా ట్రస్టు అమలు చేసి చూపిస్తోందన్నారు. శాంతికి బ్రాండ్ అంబాసిడర్ లాగా సత్యసాయి బాబా నిలుస్తారని చెప్పుకొచ్చారు. 7.50 లక్షల మంది వాలంటీర్లు సత్యసాయి బాబా ట్రస్టు ద్వారా సేవలందించారని... ఏ వ్యవస్థకు ఇంతటి శక్తి లేదన్నారు. ఇవాళ సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఏమైనా ప్రకృతి వైపరీత్యాలు వస్తే సత్యసాయి బాబా స్ఫూర్తితో సేవలందిస్తారన్నారు. ధనవంతులు, పెద్ద ఉన్నతాధికారుల కుటుంబాలకు చెందిన పిల్లలను ప్రశాంతి నిలయానికి పంపి సేవా కార్యక్రమాలు చేయిస్తారన్నారు. 140 దేశాల్లో 2 వేలకు పైగా బ్రాంచ్‌లు సత్యసాయి బాబా ట్రస్టుకు ఉన్నాయన్నారు. భగవాన్ సత్యసాయి బాబా భక్తులు శాంతికి అంబాసిడర్లుగా నిలవాలని కోరారు. సత్యసాయి సాయిబాబా సిద్ధాంతాన్ని సర్వత్రా వ్యాపించేలా కృషి చేయాలన్నారు. రాష్ట్రపతి ముర్ము జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# రైళ్లలో ముంబైకి రాయలసీమ అరటి

(మొదటి పేజీ తరువాయి)

రాయలసీమలో సుమారు 40 వేల హెక్టార్లలో పండుతున్న అరటికి సరైన ధర లభించకపోవడంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. డిసెంబరు మొదటి వారం నుంచి ధరలు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పగా, అప్పటివరకు రైతులను నష్టపోనివ్వకూడదని సీఎం స్పష్టం చేశారు. రాయలసీమ అరటిని ముంబై, కలకత్తా వంటి ప్రధాన మార్కెట్లకు రైల్వే వ్యాగన్ల ద్వారా తరలించేందుకు తక్షణమే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇందుకు ఓ ఏజెన్సీ ముందుకు వచ్చిందని అధికారులు తెలపగా, రవాణాకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అరటి ధరలు, కొనుగోళ్లపై వ్యాపారులతో ప్రతిరోజూ సమావేశాలు నిర్వహించి, మార్కెట్‌ను నిరంతరం పర్యవేక్షించాలని ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు.

**మొక్కజొన్న, పత్తి రైతులను ఆదుకునేందుకు చర్యలు**

మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సిన దుస్థితి నుంచి మొక్కజొన్న రైతులను గట్టెక్కించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ధరల వ్యత్యాసాన్ని ధరల స్థిరీకరణ నిధి ద్వారా చెల్లించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఈసారి 8.18 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేయగా, మార్క్‌ఫెడ్ ద్వారా 2.04 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రయోగాత్మకంగా ఇతర ఏజెన్సీలతో కొనుగోళ్లు చేపట్టాలని పేర్కొన్నారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. రానున్న వర్షాల దృష్ట్యా కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. రంగుమారిన, తడిచిన పత్తిని కూడా కొనుగోలు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిబంధనలైన తేమ శాతం వంటి కారణాలతో రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. సీఎం సూచనలతో స్లాట్ బుకింగ్ సమస్య పరిష్కారమైందని అధికారులు వివరించారు. కొనుగోలు కేంద్రాలను ప్రతిరోజూ తనిఖీ చేస్తూ, రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

# శ్రీ సత్యసాయి విద్యాసంస్థల క్రమశిక్షణ, విలువలు అమోఘం

**2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ : ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్,సీపీ రాధాకృష్ణన్**







**పుట్టపర్తి నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**

శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే నెంబర్-1 స్థానంలో నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధిలో నేటి పట్టభద్రులు కీలక భాగస్వాములు కానున్నారని ఆయన అన్నారు. శ్రీ సత్యసాయి జయంత్యుత్సవాల్లో గత మూడు రోజులుగా దేశంలోని అత్యున్నత స్థాయి ప్రముఖులు పాల్గొనడం, బాబా ఎంతటి శక్తిమంతులో తెలియజేస్తోందన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ, "శ్రీ సత్యసాయి విద్యాసంస్థల్లో కనిపించే క్రమశిక్షణ, నిబద్ధత మరే యూనివర్శిటీలోనూ కనిపించవు. స్నాతకోత్సవంలో విద్యార్థులందరూ ఎంతో క్రమశిక్షణతో నేలపై కూర్చోవడం నన్ను ఆశ్చర్యపరిచింది. ఇంత పెద్ద ఎత్తున ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడం గొప్ప విషయం. ఎంతమందిని గ్రాడ్యుయేట్లుగా తీర్చిదిద్దామనేది కాకుండా, ఎంతమందిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దామనే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేయడం అభినందనీయం" అని కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచ యవనికపై తనదైన ముద్ర వేస్తోందని రాధాకృష్ణన్ అన్నారు. "ఒకప్పుడు ప్రపంచం చెప్పేది భారత్ వినేది, కానీ ఇప్పుడు భారత్ చెప్పేది ప్రపంచం వింటోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇన్నోవేషన్లకు కేంద్రంగా, సుస్థిరాభివృద్ధికి ప్రతిరూపంగా ప్రధాని మోదీ దేశాన్ని తీర్చిదిద్దారని తెలిపారు. కోవిడ్ టీకాలను మన దేశం కనుగొనడమే కాకుండా, 100కు పైగా దేశాలకు ఉచితంగా అందించిందని గుర్తుచేశారు. ఈ సహాయానికి కృతజ్ఞతగా ఒక దేశాధ్యక్షుడు ప్రధాని మోదీ పాదాలకు నమస్కరించిన సంఘటనను ఆయన ఉదహరించారు. భారతమాత శక్తిమంతమైనదే కాదు, దయ కలిగినదని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. కోవిడ్ టీకాలను వ్యాపారంగా చూడకుండా మానవతా దృక్పథంతో అందించడం వల్లే మోదీ గ్లోబల్ లీడర్‌గా ఎదిగారని స్పష్టం చేశారు. పట్టాలు అందుకున్న విద్యార్థులే భవిష్యత్ లీడర్లని ఉప రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి లోకేశ్ రాజకీయాల్లోకి రావాలని సూచించినప్పుడు విద్యార్థుల నుంచి వచ్చిన స్పందన చూస్తే, వారిలో నాయకత్వ లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. సత్యసాయి బాబా సూత్రాలను, సిద్ధాంతాలను దేశ విదేశాలకు తీసుకెళ్లాల్సిన బ్రాండ్ అంబాసిడర్లు విద్యార్థులేనని పిలుపునిచ్చారు. ప్రస్తుతం సమాజానికి డ్రగ్స్ అతిపెద్ద సవాలుగా మారిందని, 'నో టూ డ్రగ్స్' అంటూ యువత పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలని కోరారు. మంచి ఫలితాలు సాధించాలంటే పరిశోధన (రీసెర్చ్) రంగానికి మరిన్ని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# పక్కపక్కనే జగన్, కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. వారిద్దరు కలిసి బయటి నుంచి ఫంక్షన్ హాలులోకి వస్తున్న వీడియోలు కూడా సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటి తొమ్మిదిన్నరేళ్లు బీఆర్ఎస్ అధికారంలో కొనసాగింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో మొదటి టర్మ్ తెలుగుదేశం, రెండో టర్మ్ వైసీపీ ప్రభుత్వాలు పాలించాయి. ఈ క్రమంలో 2019 నుంచి ఏపీలోని వైసీపీ ప్రభుత్వం, తెలంగాణలోని బీఆర్ఎస్ ప్రభుత్వం మధ్య సత్సంబంధాలు కొనసాగాయానే ప్రచారం జరిగింది. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ ఓటమి పాలయ్యాయి. ఇటీవల కేసీఆర్ పై, బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై జగన్ సానుకూల వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో వీరిద్దరు ఒక వేదికలో కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## ప్రపంచ అభివృద్ధికి మోదీ కొత్త దారి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ అభివృద్ధికి సంబంధించి నాలుగు వినూత్నమైన ప్రతిపాదనలను ఆయన ప్రపంచ దేశాల ముందు ఉంచారు. ప్రపంచ అభివృద్ధి పారామీటర్లను పునఃసమీక్షించి, సమ్మిళిత, సుస్థిర వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇదేనని మోదీ పిలుపునిచ్చారు. మొదటి ప్రతిపాదనగా, జీ20 ఆధ్వర్యంలో 'గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జ్ రిపాజిటరీ'ని ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. పర్యావరణ అనుకూల, సాంస్కృతిక జీవన విధానాలను పరిరక్షించే సాంప్రదాయ విజ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని వివరించారు. దీనికి భారతీయ విజ్ఞాన వ్యవస్థ ప్రాతిపదికగా నిలుస్తుందని తెలిపారు. రెండో కీలక ప్రతిపాదనగా, ఆఫ్రికా అభివృద్ధికి 'జీ20-ఆఫ్రికా స్కిల్స్ మల్టిప్లయర్ ఇనిషియేటివ్'ను ప్రధాని ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా రాబోయే దశాబ్దంలో ఆఫ్రికాలో 10 లక్షల మంది సర్టిఫైడ్ శిక్షకులను తయారు చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రపంచ పురోగతికి ఆఫ్రికా అభివృద్ధి చాలా కీలకమని ఆయన స్పష్టం చేశారు. అలాగే, డ్రగ్స్-టెర్రర్ సంబంధాలను ఎదుర్కోవడంపై మరో ముఖ్యమైన ప్రతిపాదన చేశారు. ఫెంటానిల్ వంటి ప్రమాదకరమైన సింథటిక్ డ్రగ్స్ వ్యాప్తిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి, ఉగ్రవాదానికి నిధులు అందకుండా చేయడానికి జీ20 దేశాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. చివరగా, 'జీ20 గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్'ను ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. ఆరోగ్య అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో వేగంగా స్పందించేందుకు జీ20 దేశాల వైద్య నిపుణులతో ఈ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## పంచాయతీ ఎన్నికలకు లైన్ క్లియర్..

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా ఉండేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో అమలు చేయనున్నారు. ఈ పద్ధతి ద్వారా అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని అధికారులకు సూచించింది. ఈ జీవోలో గిరిజన గ్రామాలకు సంబంధించి ఒక ప్రత్యేక నిబంధనను చేర్చింది. వంద శాతం ఎస్టీ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు అన్నీ ఎస్టీలకే రిజర్వ్ చేయబడతాయని స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులతో పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఘట్టం పూర్తికావడంతో త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన 37 మంది మావోయిస్టులు...

(మొదటి పేజీ తరువాయి)

లొంగిపోయిన వారికి తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నారని తెలిపారు.

మిగిలిన 34 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని ఆయన వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులు తమ ఆయుధాలను కూడా అప్పగించారని ఆయన అన్నారు. 37 మందికి తక్షణ సహాయంగా రూ.25 వేల చొప్పున అందజేశామని, ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉందని తెలిపారు. వీరితో పాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపై రూ.1.41 కోట్ల రివార్డు ఉందని, ఆ మొత్తాన్ని వారికే అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. అలాగే లొంగిపోయిన తెలంగాణ మావోయిస్టులకు ప్రభుత్వం అందించే పునరావాస ప్యాకేజీని అందజేస్తామని తెలిపారు. మిగిలిన మావోయిస్టులు కూడా త్వరగా లొంగిపోవాలని ఆయన సూచించారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారని, వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారని, వీరంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని ఆయన అన్నారు.

## రైతులకు అన్యాయం జరగనివ్వం..

(మొదటి పేజీ తరువాయి)

పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ల త్రిసభ్య కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ముఖ్య అధికారులతో పాటు రైతు జేఏసీ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు లేవనెత్తిన పలు అంశాలపై చర్చ జరిగింది. వాటి పరిష్కారం కోసం కమిటీ సమాలోచనలు చేసింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వంపై నమ్మకంతో భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం జరగదని చెప్పారు. ఏ రైతుకూ ఇబ్బంది లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ కారణంగా అమరావతిలో అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని చెప్పారు. రాజధానిలో పెండింగ్ లో ఉన్న జరీబు భూముల సమస్యకు 30 రోజుల్లో పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ కంఠాలు, లంక భూముల సమస్యలనూ పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అసైన్డ్ భూములను అమ్ముకోకుండా జగన్ ప్రభుత్వం అడ్డుకుందన్నారు.

రాజధాని ప్రాంతంలోని అసైన్డ్ భూములకు మిగతా అసైన్డ్ భూములకు వ్యత్యాసం ఉందని మంత్రి గుర్తు చేశారు. ఈ సమస్యను మూడు నెలల్లో పరిష్కరిస్తామని చెప్పారు. భూములు ఇచ్చిన రైతుల్లో 90 శాతం మందికి ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని, మరో 20 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. వచ్చే జూన్ నాటికి రాజధాని గ్రామాల్లో తాగునీరు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు.

## ఏపీలో మరో 11 కార్పొరేషన్లకు కొత్త చైర్మన్లు

**అమరావతి నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్లకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఛైర్మన్లను నియమించింది. ఈ మేరకు మొత్తం 11 సంస్థలకు ఛైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు వివిధ వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నియామకాలు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది.

**నియమితులైన ఛైర్మన్ల జాబితా**

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్: కల్యాణం శివశ్రీనివాసరావు, ఏపీ స్టేట్ అడ్వైజరీ బోర్డ్ ఆన్ చైల్డ్ లేబర్: సత్యనారాయణ రాజు ఏపీ అఫిషియల్ లాంగ్వేజ్ కమిషన్: విక్రమ్,ఉర్దూ అకాడమీ: మౌలానా షిబిలీ ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్: రామ్‌ప్రసాద్,పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా): మధుబాబు ,స్టేట్ రెడ్డిక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ: శంకర్‌రెడ్డి కుర్ని, కరికాలభక్తుల వెల్ఫేర్ కార్పొరేషన్: మిన్నప్ప,స్టేట్ షేక్, షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్: ముక్తియార్ భట్రాజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్: వెంకటేశ్వరరాజు, పెరిక వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ: వీరభద్రరావు

## తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో అంతటి చైతన్యవంతులు

**అందెశ్రీ సంతాప సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**




తెలంగాణ ప్రజలు చూడటానికి ఎంత అమాయకంగా కనిపిస్తారో, అంతటి చైతన్యవంతులని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన ప్రముఖ రచయిత అందెశ్రీ సంతాప సభలో ఆయన ప్రసంగిస్తూ, తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. వారిచ్చిన స్ఫూర్తితోనే తెలంగాణ కల సాకారమైందని ఆయన అన్నారు. అందెశ్రీ ఎన్నడూ బడికి వెళ్ళకపోయినా 'జయజయహే తెలంగాణ' వంటి అద్భుతమైన గేయాన్ని రచించారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో అందెశ్రీ పాట లేని సభ ఒక్కటి కూడా జరగలేదని ఆయన అన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారిని విస్మరించే ప్రయత్నం జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కవి రాసే పెన్నులపై మన్ను కప్పితే, అవి గన్నులై మొలకెత్తుతాయని, మీ గడీలను కూల్చివేస్తాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ గడ్డపై ప్రజలు అహంకారాన్ని, ఆధిపత్యాన్ని ఏ పరిస్థితుల్లోనూ సహించరని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎన్ని వజ్రాలున్నా కోహినూర్ వజ్రం ప్రత్యేకమైన విధంగానే, కవులు ఎంతమంది ఉన్నా అందెశ్రీ ప్రత్యేకమని రేవంత్ రెడ్డి అన్నారు.

# భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శత జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించండి.

## నవంబర్ 24 నుంచి మీకోసం రైతన్న. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 22:**
భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతోత్సవాలను జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవంగా, ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఈ ఏడాది భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా ప్రతి మండలం, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో శ్రీ సత్యసాయి సేవా సంఘాల సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గుర్తింపు కల్పించిన ఈ ఉత్సవాల్లో ప్రజలందరూ పాల్గొని, భక్తి, సేవామయ వాతావరణాన్ని సృష్టించేందుకు కృషి చేయాలన్నారు. ఈ ఉత్సవాల ద్వారా ప్రజల్లో భక్తి, సేవా భావనలు మరింత పెంపొందించేందుకు ప్రయత్నించాలని కలెక్టర్ సూచించారు. ఉత్సవాల పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం, మండల అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకుని ప్రతి అంశాన్ని నాణ్యంగా అమలు




చేయాలన్నారు.

### "మీకోసం రైతన్న"

రైతుల అభ్యున్నతికి దోహదపడే మీకోసం రైతన్న కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు వంటి కీలక అంశాలపై రైతుల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అనుబంధ రంగాల అధికారులతో పాటు గ్రామ సచివాలయ సిబ్బందితో మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి, రోజుకు కనీసం 30 మంది రైతులను ప్రత్యక్షంగా కలిసి చైతన్యవంతులను చేయాలన్నారు. రైతులను కలిసినప్పుడు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించడంతో పాటు, ప్రస్తుత పాటించాల్సిన పంటల పద్ధతులు, అగ్రిటెక్ వినియోగం, ప్రభుత్వ పథకాల వివరాలను వివరించాలని ఆదేశించారు. రైతుసేవా కేంద్రాల ఆధ్వర్యంలో ప్రతి రైతుకు ప్రభుత్వ పథకాల వివరాలు, సాంకేతిక వనరులు తెలియజేసి, వారి సమస్యలకు తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. "జిల్లాలో జరుగుతున్న శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలు, మీకోసం రైతన్న వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో ఆధ్యాత్మికతతోపాటు అభివృద్ధి దిశగా మార్పుని తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలంతా, అధికారులు, రైతులు సమన్వయంతో ముందుకు వచ్చి ఈ ఉత్సవాలు, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# చామకాలుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన జెసి కొల్లా బత్తుల కార్తీక్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 22:**
నంద్యాల పట్టణంలోని చామకాలువకు కేటాయించిన భూమిని కొంతమంది ఆక్రమదారులు ఆక్రమించుకుంటున్నారనే ఫిర్యాదులు రావడంతో శనివారం జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ చామకాలువకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ మాట్లాడుతూ....గతంలో చామకాలువకు వరద నీరు వచ్చిన సమయంలో నంద్యాల పట్టణంలోని పలు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. దీంతో చామకాలువకు రక్షణ గోడ ఏర్పాటు చేసేందుకు కాలు అనుకుని భూసేకరణ చేయడం జరిగింది. ఈ భూమిని కొంతమంది ఆక్రమించుకుంటున్నారన్న ఫిర్యాదు రావడంతో వెంటనే జాయింట్ కలెక్టర్ ఆ ప్రాంతాన్ని రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇక్కడ ఎటువంటి ఆక్రమణలు జరగడానికి వీలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. మరియు మున్సిపల్ కార్యాలయం వెనుక వైపు ఉన్న సర్వే నెంబర్ 415 నందు 50 సెట్ల స్థలంలో ఇస్కాన్ వారు టెంపుల్ నిర్మించేందుకు స్థలం కావాలని కోరడం జరిగిందన్నారు. ఈ స్థలాన్ని కూడా జాయింట్ కలెక్టర్ పరిశీలించి రెవెన్యూ అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు.

# రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు విద్యార్థినీ విద్యార్థులు ఎంపిక.

## పాఠశాల ప్రధానోపాధ్యా యులు గోవిందరాజ.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ నవంబర్ 22:**విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యం లోఈనెల 18వ తేదీ జరిగిన జిల్లా స్థాయి బేస్బాల్ ఎంపిక పోటీలలో అత్యంత ప్రతిభ కలవరచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు 9వ తరగతి విద్యార్థి రిహాన్ హుసేన్ ఏడవ తరగతి విద్యార్థిని అక్షరమాహి ను, అదేవిధంగా ఏడవ తర గతి విద్యార్థిని సీమా సాఫ్ట్బాల్ పోటీలలో రాష్ట్రస్థాయి పోటీల కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధా నోపాధ్యాయులు గోవిందరాజ తెలియజేశారు. ఈనెల 29వ తేదీ నుండి హాలో నెల్లూరు, ఒకటవ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరు లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉధ్యాయులు షేక్షావలి తెలియజేశారు

# తల్లిలాంటి ప్రేమను అంగన్వాడీ కేంద్రాలు అందించాలి.

**అంగన్వాడీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి.**


**తాజా కాయగూరలు, విలువలతో కూడిన విద్యను చిన్నారులకు అందించాలి.**

**అంగన్వాడీ కేంద్రాల్లో ఎలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదు.**

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబరు, 22:**
అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు తల్లిలాంటి ప్రేమను అందజేయాలని సిడిపిఓ, సూపర్వైజర్లను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్, అపార్ ఐడి, అభా ఐడి, ప్రీస్కూల్ అటెండెన్స్ తదితర అంశాలపై సిడిపిఓలు, సూపర్వైజర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఐసిడిఎస్ పిడి లీలావతి, జిల్లా కోఆర్డినేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమావేశాల్లో ఎక్కువ శాతం విద్యా, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ఎక్కువ శాతం బడ్జెట్ కేటాయించడం జరుగుతోందన్నారు. ఈ అంశాన్ని బట్టి ప్రభుత్వాలు స్త్రీ శిశు సంక్షేమ శాఖకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందో తెలుసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు, పాలిచ్చే తల్లులకు ఎన్నో వేల కోట్ల రూపాయలతో పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు అందజేయడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అందించే ఆహారం వల్ల దేశ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు ఉండాలని, అంతేకుండా పరిసరాలతో పాటు టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు తాజా కాయగూరలతో పాటు వారి వయస్సును బట్టి విలువలతో కూడిన విద్యను చిన్నారులకు అందించాలని, వాటి ద్వారా పిల్లలు ఉత్సాహవంతులుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. టీనేజ్ గర్భాలకు సంబంధించి బనగానపల్లె, డోన్, ఆళ్లగడ్డలో ఎక్కువ శాతం కేసులు నమోదు అవుతున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సిడిపిఓలను కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా 6 నెలల నుండి 3 సం.లు, 3 సం.ల నుండి 6 సం.ల వయస్సు ఉన్న పిల్లలు ఎంత మంది ఉన్నారు అనే వివరాలను సోమవారం సాయంత్రం నాటికి అందజేయాలని సిడిపిఓ, సూపర్వైజర్లను కలెక్టర్ ఆదేశించారు. సదరు డేటాను అనుసరించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. అదే విధంగా రానున్న రోజుల్లో అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించడం జరుగుతోందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఎలాంటి సంఘటనలు పునరావృతం జరిగిన రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందోని సిడిపిఓలు, సూపర్వైజర్లను కలెక్టర్ హెచ్చరించారు.అనంతరం సఖి వన్ స్టాప్ సెంటర్, మిషన్ వాత్సల్య, పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలు తదితర అంశాలపై కులకుశంగా చర్చించారు. అదే విధంగా దత్తత ప్రక్రియకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.






# మార్కెట్ ప్రసాద్ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్ర దర్శనం.

## ఆధ్యాత్మికతతో పాటు ఆత్మీయ కలయికలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 22:**
నంద్యాల ప్రముఖ సామాజిక నేత మార్కెట్ ప్రసాద్ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాన్ని దర్శించి, శ్రీకాళహస్తీశ్వర స్వామిని భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం నందమూరి కుటుంబ సభ్యులు, నందమూరి రామకృష్ణ గారితో గౌరవపూర్వకంగా సన్నిహితంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పరస్పర ఆప్యాయతను పంచుకుంటూ సామాజిక



అంశాలపై చర్చించారు. తదుపరి శ్రీకాళహస్తి పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ రంగినేని చెంచయ్య నాయుడు తో స్నేహపూర్వకంగా కలిసిన మార్కెట్ ప్రసాద్, రైతు సంక్షేమం, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ వ్యవస్థలో అభివృద్ధి చర్యలపై విశదంగా మంతనాలు జరిపారు. రైతులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలపై చర్చించగా, భవిష్యత్తులో పరస్పర సహకారంతో కార్యక్రమాలు చేపట్టేందుకు అంగీకారం వ్యక్తమైంది.ఈ పర్యటన ఆధ్యాత్మికతతో పాటు సామాజిక, వ్యవసాయ రంగాల అభివృద్ధికి దోహదపడే విధంగా సాగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.


# విలువలతో కూడిన విద్యను అందించడం వర్సిటీ ప్రత్యేకత

**సత్యసాయి యూనివర్సిటీ ప్రత్యేకత అదే!: మంత్రి నారా లోకేశ్**

**పుట్టపర్తి శ్రీ సత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేశ్**

**ముఖ్య అతిథిగా హాజరైన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్**

**పుట్టపర్తి నవంబర్ 22 (రిపబ్లిక్ న్యూస్)**
విలువలతో కూడిన విద్యను అందించడమే శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ప్రత్యేకత అని, ఇదొక ఆధునిక గురుకులం అని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రశంసించారు. రాయలసీమ గడ్డ ధైర్యానికి, త్యాగానికి, ఆధ్యాత్మికతకు ప్రతీక అని ఆయన అభివర్ణించారు. శనివారం శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవ కార్యక్రమం ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో



ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గౌరవ అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ విద్యార్థులను ఉద్దేశించి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.

ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని లోకేశ్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "పుట్టపర్తిని సందర్శించే ప్రతి హృదయంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ప్రేమ, కరుణ, ఆధ్యాత్మిక శక్తి ప్రకాశిస్తుంది. ఆయన అందించిన సేవలు దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం చేరాయి. ఎన్నో గ్రామాలకు తాగునీటి సరఫరా కార్యక్రమాలు, వేలాది మందికి ఉచిత వైద్య సేవలు అందించడమే కాకుండా, లక్షలాది మందికి దైవిక అనుభూతిని పంచారు" అని లోకేశ్ గుర్తుచేశారు.రాయలసీమ పవిత్ర భూమి అని, ఈ నేల ధైర్యం, నిరాడంబరత, త్యాగానికి ప్రతీకగా నిలుస్తుందని మంత్రి అన్నారు. "ప్రపంచానికి ఆధ్యాత్మిక కిరణంగా నిలిచిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఈ గడ్డపైనే జన్మించారు. ఆయన దార్శనికత, కరుణ ఈ విశ్వవిద్యాలయానికే కాకుండా యావత్ ప్రపంచానికే మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయి. ఈ పవిత్ర మట్టిలోనే ఆధ్యాత్మికత, నిరాడంబరత, త్యాగం వంటి గుణాలు నిండి ఉన్నాయి" అని వివరించారు. ఈ విశ్వవిద్యాలయం బాబా దార్శనికతకు నిలువుటద్దమని, ఇదొక ఆధునిక గురుకులమని కొనియాడారు. ఇక్కడి విద్యార్థులు కేవలం అర్హతలతో కాకుండా ఉన్నతమైన వ్యక్తిత్వంతో పట్టభద్రులు అవుతున్నారని, కేవలం నైపుణ్యంతో కాకుండా ఒక ప్రయోజనంతో పనిచేసే వృత్తి నిపుణులుగా ఎదుగుతున్నారని ప్రశంసించారు.

# నంద్యాల మున్సిపల్

# రెవెన్యూ ఇన్స్పెక్టర్ పోస్ట్ కు దిక్కెవరు.?

-రెవెన్యూ ఇన్స్పెక్టర్ యుగంధర్ ఆత్మకూరు కు పదోన్నతిపై బదిలీ.

-మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ పోస్టుకు రాము బాబోయ్ అంటున్నారా.

-మున్సిపల్ ఆదాయానికి గండి పడనుందా.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22:**
నంద్యాల మున్సిపల్ రెవెన్యూ శాఖకు కష్టకాలం వచ్చింది.మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లుగా గతంలో ఇద్దరు ఉండేవారు.కొద్దిరోజులుగా ఒక అధికారికి అనారోగ్యానికి గురవడంతో ఒక్కరే ఆ బాధ్యతలు భుజానికివేసుకొని నెట్టుకొచ్చేవారు.రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లగా పదోన్నతులు కల్పించారు.రాష్ట్ర వ్యాప్తంగా శనివారం కొందరికి పదోన్నతులు కల్పించారు.ఈ నేపథ్యంలోనే నంద్యాల మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ యుగంధర్ కు సీనియర్ అసిస్టెంట్ గా పదోన్నతి పొందారూ.ఆయన ఆత్మకూరు కు పదోన్నతిపై బదిలీ కావడంతో ఆ పోస్టు కు ఎవరు రావాలన్నా రాని పరిస్థితి నెలకొంది.నంద్యాల మున్సిపాలిటీలో గత రెండేళ్ల క్రితం పన్నుల వసూళ్లలో అయిదవ స్థానంలో ఉండేది.ఇటీవల ఉన్నత అధికారులు,సిబ్బంది సరైన వారు లేకపోవడంతో కన్ను కొత్త పోయినట్టుగా సెంచరీ చేరువలో 96 స్తనానికి పన్నుల వసూళ్లలో దిగజారిపోయింది.పన్నుల వసూళ్లు అనుకున్నంత స్థాయిలో రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది.అసలే పన్నుల వసూళ్లు రోజు,రోజుకు దిగజారి పోతున్న సమయంలో అన్ని భుజాన వేసుకొని పన్నులు నిరంతరాయంగా తిరుగుతూ వసూళ్లు చేస్తున్న ఉన్న ఒక్క రెవెన్యూ ఇన్స్పెక్టర్ యుగంధర్ పదోన్నతిపై బదిలీ పై వెళుతుండడంతో మున్సిపల్ రెవెంటుకు దిక్కులేకుండా పోతుందని తెలుస్తోంది.ప్రభుత్వం ప్రస్తుతం ఆ పోస్టు కు ఎవరిని నియమించకపోవడం,ఇక్కడికి రావాలంటేనే బయటపడే పరిస్థితి నెలకొంది.పన్నులు వసూళ్లు వచ్చే మార్చిబ్బరకు వసూళ్లు చేయాలంటే పెద్ద రిస్క్ తో కూడుకున్న పని కావడంతో ఎవరు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.మున్సిపాలిటీలో బాగా పనిచేసే వారు బదిలీ కావడంతో మున్సిపాలిటీకి భారీ గండి పడే ప్రమాదం ఉందని విశ్లేషకులు , మేధావులు పేర్కొంటున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## గ్రామీణ అభివృద్ధిలో గ్రామ సభలు కీలకం.




**ఆంధ్ర ప్రగతి మహానంది, నవంబర్ 22:** గ్రామీణ అభివృద్ధిలో గ్రామసభలు కీలకమని సర్పంచ్ చలం శిరీష పేర్కొన్నారు. మహానంది సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామం అభివృద్ధికి అవసరమైన పలు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. ఇందులో స్థానిక ప్రజలు హౌసింగ్, ఉపాధి హామీ పథకంపై పలు అర్జీలు అందజేసిన గ్రామస్తులు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ భాస్కర్, సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, స్థానిక టిడిపి నాయకులు గంగిశెట్టి మల్లికార్జున రావు, తదితరులు పాల్గొన్నారు.

## స్పష్టమైన ఓటర్ల జాబిత రూపకల్పనకు సహకరించండి.

### రాజకీయ పార్టీ ప్రతినిధులు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోండి.

### జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబరు, 22:** స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ పేర్కొన్నారు. శనివారం జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్ లో ఓటర్ల జాబితా రూపకల్పన పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జనసేన పార్టీ ప్రతినిధి రవి, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి ప్రదీప్, బిఎస్పీ పార్టీ ప్రతినిధి కొట్టం శ్రీనివాసులు, వైఎస్ఆర్సిపి పార్టీ ప్రతినిధి సాయిరాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సయ్యద్ రియాజ్ బాషా, సిపిఐ పార్టీ ప్రతినిధి పి.నరసింహులు, టిడిపి పార్టీ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ మాట్లాడుతూ స్పష్టమైన ఓటర్ల జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీ ప్రశ్నలు సహకరించాలన్నారు. అదేవిధంగా ఫార్మ్ 6, 7, 8 లను పెండింగ్ ఉండకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని రాజకీయ పార్టీ ప్రతినిధులకు డిఆర్ఓ తెలిపారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు కూడా బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని వారు స్థానిక ఓటరు అయి ఉండాలని, అలా లేని పక్షంలో నియోజకవర్గ అభ్యర్థులను బూతు లెవల్ ఏజెంట్లుగా నియమించుకోవాలని రాజకీయ పార్టీ ప్రతినిధులకు డిఆర్ఓ తెలిపారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ కు సంబంధించి రాజకీయ పార్టీ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదించడం జరిగిందన్నారు.రాజకీయ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ మున్సిపల్, పంచాయితీ ఎన్నికలలో ఈవీఎం మిషిన్లకు బదులుగా బ్యాలెట్ పేపర్లను ఏర్పాటు చేసేలా చూడాలని రాజకీయ పార్టీ ప్రతినిధులు డిఆర్ఓకు నివేదించారు.

## శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి గడివేముల నవంబర్ 22:** గడివేముల మండలం పరిధిలోని శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి దేవాలయం ఈవోగా చంద్రశేఖర్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు ఈనెల 5వ తేదీ చంద్రశేఖర్ రెడ్డి ఈవోగా నియమిస్తూ దేవాదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు గత నెల 30వ తేదీ భోగేశ్వరం ఈవో పనిచేస్తున్న రామానుజన్ ఉద్యోగ విరమణ చేయడము తోఆయన స్థానంలో కోవెలకుంట్ల గ్రూప్ దేవాలయల ఈఓ చంద్రుడు ను అధికారులు నియమించారు. కానీ ఈ నియామకాన్ని స్థానిక ఎమ్మెల్యే వ్యతిరేకించడంతో అధికారులు కోవెలకుంట్ల గ్రూప్ దేవాలయాలయాల ఈవో చంద్రుడు స్థానంలో ఓర్వకల్లు మండల గ్రూప్ దేవాలయాల ఈవో చంద్రశేఖర్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. భోగేశ్వరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుండడంతో సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్న చంద్రశేఖర్ రెడ్డికి భోగేశ్వరం అభివృద్ధి బాధ్యతలు అప్పగించాలని ఎమ్మెల్యేచరితారెడ్డి బావించి మంత్రి ఎన్ఎండి ఫరూక్ తో చర్చించి చంద్రశేఖర్ రెడ్డిని ఈవోగా నియమించాలని కోరడంతో అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఈ ఉత్తర్వులు అమలు కావడానికి ఇంత సమయం పట్టింది. ప్రధమనంది దేవాలయం నుండి దుర్గ భోగేశ్వర స్వామి దేవాలయం విడదీసి రెండు దేవాలయాలకు విడివిడిగా అధికారులను నియమించాలనిమంత్రి ఫరూక్ఆదేశించడంతో చంద్రుడు కు ప్రధమనంది ఈవోగా, చంద్రశేఖర్ రెడ్డి ని భోగేశ్వరం ఈవోగా దేవాలయ శాఖ అధికారులు నియమించారు.

## శ్రీ ఓంకార సిద్దేశ్వర స్వామి సన్నిధిలో రామకృష్ణ విద్యా సంస్థల అధినేత జి.రామకృష్ణారెడ్డి..!



**ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు నవంబర్ 22:** శ్రీ ఓంకార సిద్దేశ్వర స్వామి దేవస్థానం ఓంకార క్షేత్రములో ఈ రోజు నంద్యాల శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల అధినేత జి.రామకృష్ణారెడ్డి, శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకము, అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి దేవస్థానం చైర్మన్ అల్లె చెన్నారెడ్డి, ధర్మకర్తల సభ్యులు, ఆలయ ఈవో ఏ.నాగ ప్రసాద్ ఘన స్వాగతం పలికి వారిని దుశ్శాలతో ఘనంగా సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఉన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు యు.చక్రపాణి శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ ఈవో ఏ.నాగ ప్రసాద్ మాట్లాడుతూ జి రామకృష్ణారెడ్డి గారు దేవస్థానం ఆవరణ యందు క్యూ లైన్ నందు రేకుల షెడ్డు నిర్మాణం చేసి ఉన్నారని, ఆలయ అభివృద్ధికి సహకరించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# మహానంది దేవాలయంలో భక్తుల సొమ్ము నొక్కేస్తున్న ఉద్యోగి.?

### -15 ఏళ్లుగా గుట్టుగా సాగుతున్న తతంగం. - కార్తీకమాసంలో బయటపడ్డ బాగోతం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22:** పరమ పవిత్రమైన మహానంది దేవస్థానంలో భక్తుల విరాళాలు కాజేస్తున్న ఒక ఉద్యోగి తతంగం కార్తీకమాసంలో బయటపడింది. గతంలో కూడా విరాళాల దోపిడి సాగుతుందని వెలుగులోకి తెచ్చినా పట్టించుకునే నాధుడే కరువయ్యారు. మహానంది దేవాలయంలో అడుగడుగునా దోపిడి సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. కార్తీకమాసం, శివ రాత్రి ,దసరా పండుగా,ఇతర పండుగలు వస్తె దేవాలయంలో పనిచేసేవారు దోపిడి అంతా ఇంతా కాదు.వివరాల్లోకి వెళితే కార్తీక మాసం సందర్భంగా ప్రతి ఏట గుత్తి కి చెందిన ఒక భక్తుడు 20 లీటర్ల నూనెను విరాళంగా ఇచ్చేవారు.ఈ నూనెను కు సంబంధించిన విరాళం దేవాలయంలోని ఒక అధికారికి పంపిస్తుండడం ఆనవాయితీగా మారింది .ఆ ఉద్యోగి సొంతం కు వాడుకుంటూ వస్తున్నారు.



కార్తీక మాసం లో గత 15 ఏళ్లుగా చేస్తున్న దోపిడి బయటకి పొక్కింది.దేవాలయంలో రోజు దోపిడి జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.దేవాలయంలో కొబ్బరి కాయ కొట్టినా 10 ఇవ్వాల్సిందే. చెప్పులు,సెల్ ఫోన్ లకు అధికంగా డబ్బులు తీసుకుంటున్నారు. స్పర్శ దర్శనాలు, నవగ్రహ దీపాలు, తాయతులు విక్రయించరాదని తెలిసినా నిత్యం అమ్మకాలు జరుగుతున్నాయి. గతంలో దేవాలయానికి వచ్చే విరాళాలు సైతం కొందరు వారి అకౌంట్లలో వేసుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు దేవాలయంలో సమర్పించే పట్టు చీరెలు సైతం మార్పులు చేస్తున్నారనే అపవాదు సైతం వినిపిస్తుంది.స్వామివారికి కొందరు ఇచ్చే కానుకలు, బంగారు, వెండి వస్తువులు సైతం దోపిడి జరుగుతున్నట్టు సమాచారం. ప్రసాదం విక్రయించే ప్రదేశాల్లో ఇప్పటికే ఎన్నో పర్యాయాలు అధికంగా డబ్బు దొరికిన విషయం తెలిసిందే. దేవాలయంలో సస్పెండ్ అయినవారు సైతం పనిచేస్తూ అంతా ఆయన హవా సాగుతున్నట్టు వినిపిస్తుంది. 15 ఏళ్లుగా దోపిడి జరుగుతున్నా పట్టించుకోకపోవడం విశేషం.ఇప్పటికైనా మహానంది లో భక్తులు ఇచ్చే విరాళాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.కారకుడైన ఉద్యోగిని వీధుల నుంచి తప్పించి కటినంగా శిక్షించాలని భక్తులు కోరుతున్నారు.

## అపూస్మా "ఆళ్ళగడ్డ యూనిట్ లో 23న జనరల్ బాడీ మీటింగ్..!

### -దాదాపు 300 మంది టీచర్స్ తో సమావేశం ఏర్పాటు.

### -రాష్ట్ర, జిల్లా మరియు మండల స్థాయి సమస్యల పరిష్కారానికై కృషి. --జిల్లా అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22.** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపూస్మా) వారి ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ లోని ముత్యాలపాడు బర్డ్ హై స్కూల్ నందు నవంబర్ 23 ఆదివారం రోజున "అపూస్మా" జిల్లా జనరల్ బాడీ ఎలక్షన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు బిజ్జం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ జనరల్ బాడీ సమావేశంలో దాదాపు 300 మంది టీచర్స్ తో సమావేశం జరుగుతుందని, ఈ సమావేశంలో రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి మరియు మండల స్థాయి సమస్యలపై చర్చించి, సభ్యులందరి సమక్షంలో నిర్ణయాలు తీసుకొని పరిష్కార దిశగా కార్యచరణకు కృషి చేస్తామని, ఈ సమావేశానికి జిల్లాలోని అపూస్మా సభ్యులందరూ హాజరవుతున్నారని తెలియజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు మాత్రమే ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డును ప్రధానం చేస్తుందని, దాన్ని ఆధారంగా తీసుకొని ప్రవేట్ స్కూల్లో మంచి భోధన చేసే వారికి కూడా ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించాలని ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ ఇన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ అపూస్మా వారు నిర్వహించిన ఈ అవార్డు కార్యక్రమం మంచి శుభ పరిణామం అని, ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకాలని అన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితిలో కూడా అపూస్మా ఆధ్వర్యంలో సభ్యులందరికీ ధైర్యాన్ని నింపి వారికి కావలసిన నిత్యవసర సరుకులు మరియు కొంత ఆర్థిక సాయం చేయడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ భాస్కర్, జిల్లా ట్రెజరర్ హుస్సేన్ భాష, వైస్ ప్రెసిడెంట్ వికాస్ వల్లి, ఆళ్లగడ్డ యూనిట్ ప్రెసిడెంట్ అమిర్ భాష తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రమాణాలు ,ట్రాఫిక్ నిభందనలు పాటించి సురక్షిరంగా గమ్యం చేరండి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల క్రైమ్ నవంబర్ 22:** రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమంలో భాగంగా కర్నూలు రేంజ్ డి ఐ జి.కోయ ప్రవీణ్ ఆదేశాలమేరకునంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ సూచనలతో జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యాక్రమాలను ఏర్పాటు చెయ్యడతో పాటు మోటార్ వెహికల్ చట్టాన్ని కఠినంగా అమలు చేయడం మరియు జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు అనగా స్పీడ్ బ్రేకర్స్ ను ,స్టాపర్స్ బోర్డ్స్ ను ,రేడియం స్టికర్స్ ను ,డేంజర్స్ సిగ్నల్ ను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమలో భాగంగా నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా గారు నంద్యాల కర్నూల్ నేషనల్ హైవేలో చాబోలు మరియు వెంకటేశ్వరాపురం గ్రామాలవద్ద ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో నేషనల్ హైవే అథారిటి వారి సహకారంతో రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహనాల వేగాన్ని తగ్గించడం కొరకు స్టాపర్స్ బోర్డ్స్ ను మరియు రేడియం స్టికర్స్ ను ఏర్పాటు చెయ్యడం జరిగింది.



అనంతరం నంద్యాల పట్టణ కేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీ నందు గల నలంద జూనియర్ కళాశాల నందు సుమారు 200 మంది విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు నివారణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మరియు ప్రతి ఒక్కరూ వాహనాలు నడుపునప్పుడు ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపరాదని ఫ్లక్ కార్డుల ద్వారా అవగాహన కల్పించడం జరిగింది.

**పోలీసు అధికారుల సూచనలు.**

1.“ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి %-% శిరో భారం కాదు.. రక్షణ కవచం.

2.డ్రైవింగ్ చేసేటపుడు వాహన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ ఎప్పుడూ దగ్గర ఉంచుకోవాలి.



3.సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదు

4.మైనర్ డ్రైవింగ్ చేయరాదు.

5.మద్యం సేవించి వాహనాలు నడపరాదు.

6.రాంగ్ రూట్స్ లో ప్రయాణించరాదు.

7.వాహనాలను కేటాయించిన ప్రదేశాలలో మాత్రమే పార్కింగ్ చెయ్యాలి.

8..ట్రిబుల్ రైడింగ్ చేయడం ప్రమాదకరం.

9.వేగం కన్నా ప్రాణం మిన్న' అన్న సూత్రాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

10.“ రోడ్డు దాటే సమయంలో రెండు వైపులా గమనిస్తూ, అప్రమత్తంగా ఉంటూ దాటాలి.

11.ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించడం జరిగింది.

# బాల అకాడమీ సిల్వర్ ఓక్స్ పాఠశాల చిన్నారులచే గ్రీన్ కలర్ ఆక్టివిటి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22:** బాల అకాడమీ సిల్వర్ ఓక్స్ పాఠశాల నందు ఈ రోజు గ్రీన్ కలర్ ఆక్టివిటి నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు ఆకుపచ్చ దుస్తులు ధరించి, వివిధ రకాల పండ్లు, కూరగాయలు మరియు బొమ్మలు తెచ్చి అలంకరించారు. ద్రాక్ష, మిరప, బెండకాయ మాస్కులు అలంకరించుకున్నారు. చిన్నారులు నీలి రంగు మరియు పసుపుపచ్చ రంగు కలిపి ఆకు పచ్చ రంగు తయారు చేశారు. ప్రకృతిలో ఎక్కడ చూసినా పచ్చదనమే కనిపిస్తుంది. రామచిలుకలు, సీతాకోక చిలుకలు, కూరగాయలు, పండ్లు, పచ్చిక బయల్లు (గార్డెన్), చెట్లు, గాజులు ఎలా ఎన్నో ఆకుపచ్చ రంగులో ఉంటాయని చిన్నారులు తెలుసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ రవీంద్ర నాథ్ మరియు ప్రిన్సిపాల్ శ్రీ మతి మాధవీ లత మేడమ్ గారు







మాట్లాడుతూ ఆకుపచ్చ రంగు ఎదుగుదలకు, నిలకడకు గుర్తు.అరిగ్యపరంగా ఆకు పచ్చ రంగు ఎంతో మేలు చేస్తుంది. ఆకు పచ్చ రంగు నుండి వచ్చే కాంతికిరణాలు కళ్ళకు చలువ చేస్తాయి. ఈ రంగు ఎన్నో రకాల వ్యాధులను అరికడుతుంది. ఆకుపచ్చ రంగు హృదయ చక్రాన్ని సూచిస్తుంది. ఈ రంగు తేజేశ్చక్రం ఉన్నవారిలో విజ్ఞాన ఆసక్తి ఉంటుంది. అభివృద్ధి గడించాలనే ఆశతో ముందుకు సాగుతారు అని తెలిపారు. మన పర్యావరణాన్ని కాపాడే శక్తి కూడా ఆకుపచ్చ రంగుకు ఉంటుందని మన ప్రకృతే మనకు చెబుతుంది. అందుకే ఈ రోజు చిన్నారులకు చేటన్లు నాటి వాటిని సంరక్షించడం తెలియాలని చెట్ల పంపిణి కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ రంగు యెక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు.

# నాలుగు లేబర్ కోడ్ లను రద్దు-చేయాలి.

**44 కార్మిక చట్టాలను అమలు చేయకపోతే పతనం తప్పదు. - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిఐటియు నేతల హెచ్చరిక.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22:**
కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం 12 సంవత్సరాల కాలంలో ప్రజలను కార్మికులను పూర్తిగా విస్మరించి పెట్టుబడిదారులకు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేయడం కోసం బ్రిటిష్ కాలం నాటి నుండి ఉన్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా కుదింపు చేసి కార్మికులను నయా బానిసలుగా చేయడాన్ని సిఐటియుగా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, నేటి నుండి అన్ని రాష్ట్రాలలో అమలు చేయాలని నోటిఫై చేయడాన్ని వ్యతిరేకిస్తూ గాంధీచౌక్ సెంటర్లో నోటిఫికేషన్ కాపీలను దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కేం మహమ్మద్ గౌస్ పి వెంకటలింగంలో వీరితో పాటు సిఐటియు పట్టణ కోశాధికారి సుబ్బారావు,నాయకులు జైలాన్, రాణా, హుసేని,వెంకట్రావు, మునాఫ్, శ్రీను, సత్యం, నాగేంద్ర, బుజ్జి లతో పాటు మరో 30 మంది కార్మికులు పాల్గొనడం జరిగింది.
ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు కే. మహమ్మద్ గౌస్ అధ్యక్షత వహించగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వెంకట లింగం లు మాట్లాడుతూ బ్రిటిష్




కాలం నాటి నుండి ఉన్న 44 కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం గత 12 సంవత్సరాల కాలంలో కార్మికులను నయా బానిసలుగా చేయడమే ధ్యేయంగా పెట్టుకుని నాలుగు లేబర్ కోట్లుగా కుదింపు చేసి బీహార్ ఎన్నికల ముగిసిన అనంతరం వెంటనే బిజెపి కపట కపట బుద్ధిని బయటపెట్టి నేటి నుండి అమలు చేయాలని అన్ని రాష్ట్రాలకు నోటిఫై పంపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తన ఆప్త మిత్రులైన అంబానీ అదానిలాను లక్షల కోట్లకు అధిపతులుగా చేయాలని జయంతో కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా వేతనాలను పెంచకుండా ఇచ్చిందే తీసుకోవాలి సమ్మె చేసే హక్కు లేదు యూనియన్ పెట్టుకోవాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చే విధంగా లేనిపోని షరతులను పెట్టి కార్మికులను కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి కార్మికుల ను నయా బానిసలుగా చేయడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సీఐటీయూగా విశాఖపట్నంలో జరిగే ఆల్ ఇండియా మహాసభలలో చర్చించి దేశవ్యాప్తంగా ఉన్న 40 కోట్ల మందికి పైగా కార్మికులను ఉద్యోగులను అందరిని ఏకం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు ఎక్కడ ఏ రాష్ట్రంలోనూ అమలు కాకున్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మోడీ చెప్పిందే తడవుగా 13 గంటల పని విధానాన్ని అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, అదే విధంగా 13 గంటల పని విధానాన్ని అమలు చేయాలని కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేయడం సరైనది కాదని, దేశంలో రోజురోజుకు మహిళలకు రక్షణ లేకుండా ఉంటే మహిళలను కూడా రాత్రిపూట పని చేయించాలని నిబంధనను పెట్టడం దుర్మార్గమని ఇప్పటికైనా మోడీ కూటమి ప్రభుత్వాలు కార్మికులను విస్మరించి, కార్మికుల కుటుంబాలను నాశనం చేసే విధానాలను మానుకోవాలని, లేకుంటే దేశంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలకు కార్మికులు, ప్రజలే సరైన సమయంలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## సీఎం చంద్రబాబు ను కలిసిన ఎమ్మెల్యే అఖిలప్రియ.



**ఆంధ్ర ప్రగతి ఆళ్ళగడ్డ నవంబర్ 22:** ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చనిపోయిన టిడిపి కార్యకర్తల కుటుంబాలకు న్యాయం చేయాలని చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చనిపోయిన కార్యకర్తల కుటుంబాలకు డబ్బులు శాంక్షన్ చేసిన సీఎం చంద్రబాబు నాయుడు అలాగే – సీఎం రిలీఫ్ ఫండ్స్ కు– సంబంధించిన అమౌంట్ కూడా శాంక్షన్ చేయడమైనది. అంతేకాకుండా ఆళ్ళగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుగా అభివృద్ధికి మరియు షాది ఖానా కు కాంపౌండ్ వాల్ కు కూడా అమౌంట్ శాంక్షన్ చేసిన ముఖ్యమంత్రి. ఆళ్లగడ్డ నియోజకవర్గం లో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను కూడా ఆదుకుంటామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు.

# విశ్వ విజేత ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి.!

**...మోదీ విధానాలతో బిజెపి వైపు చూస్తున్న ప్రజలు.-..ఎదురుపాడు లో బిజెపిలో భారీ చేరికలు.**

**...నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు కు ఘనస్వాగతం.**









**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22:**
విశ్వ విజేత భారత ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందుతుందని నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు పేర్కొన్నారు. నందికొట్కూరు నియోజకవర్గం కొత్తపల్లి మండలం లో నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు సమక్షంలో జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎదురుపాడు గ్రామ నాయకులు బోయ నాగేశ్వర రావు అనుచరులతో భారీ సంఖ్యలో బిజెపి పార్టీ లో చేరారు. నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు గ్రామానికి చేరుకోవడంతో కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. భారీ సంఖ్యలో కార్లతో డప్పు,వాయిద్యాల మధ్య ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జై శ్రీరామ్,మోదీ జిందాబాద్,అభిరుచి మధు నాయకత్వం వర్ధిల్లాలి అనే నినానాదళతో టపాసుల మోతతో దద్దరిల్లిపోయింది. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బోయ నాగేశ్వర రావు అనుచరులను స్వాగతంగా ఆహ్వానించి కండువాలు కప్పి పార్టీ లోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వ విజేత భారత ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం అభివృద్ధి దిశలో పయనిస్తుందని అన్నారు. దేశంలో బిజెపి,రాష్ట్రంలో కూటమి ప్రభుత విధి విధానాలతో అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. మోదీ 11 ఏళ్ల పాలనలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఆర్థికంగా బలోపేతం చేసి నలగవస్తానానికి తీసుకొచ్చారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనగా దేశ వ్యాప్తంగా ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చారన్నారు. జాతీయ రహదారులు, పోర్టులు, విమానాశ్రయాలు ఏర్పాటుకు కృషిచేస్తున్నారన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి వారికి చేయూత అందిస్తున్నారన్నారు. ప్రపంచదేశాలు భారత వైపు చూసే విధంగా చేస్తున్నారన్నారు. ఆపరేషన్ సిందూర్ తో భారత్ వైపు కన్నెత్తి చూడాలంటే భయపడే పరిస్థితి కి తీసుకొచ్చారన్నారు. పేద,మధ్య తరగతి ప్రజల కోసం జీఎస్టీ తగ్గించడంతో వివిధ రకాల వస్తువులు తక్కువధారాలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. పేద వారు వాహనాల్లో తిరిగే విధంగా కార్లు ధరలు తగ్గడంతో పేదవారి ఆశలు సాకారం చేశారన్నారు. బీహార్ ఎన్నికల్లో బిజెపి విజయడంకా మ్రోగించిందని అన్నారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే ఎందరో బిజెపి విధి విధానాలతో పార్టీలో చేరుతున్నారన్నారు. బూతు స్థాయి నుంచి కార్యకర్తలను బలోపేతం చేస్తున్నామన్నారు. బిజెపి పార్టీని నమ్ముకున్న వారికి సముచిత స్థానం కల్పించడంలో బిజెపి ముందంజలో ఉంటుందన్నారు. శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ చైర్మెన్,కమిటి సభ్యులు గా అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. బిజెపి పార్టీలో సామాన్య కార్యకర్తగా పార్టీలో చేరి నంద్యాల జిల్లా అధ్యక్షులు గా కొనసాగుతున్నారని చెప్పుకొచ్చారు. రాబోయే కాలంలో రాష్ట్రంలో బిజెపి బలోపేతం కావడం ఖాయమన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ బిజెపి అంటే అభివృద్ధి,బరోసాకు చిహ్నం అన్నారు. ప్రధాని మోదీ దేశం,రాష్ట్రం లో చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై పార్టీలో చేరనున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లెల కృష్ణా రెడ్డి,విశ్వరూప ఆచారి,మౌళి భాష,జిల్లా ప్రధాన కార్యదర్శి కాసేట్టి చంద్ర శేఖర్,జిల్లా ఉపాధ్యక్షులు రవి,శ్రీనివాస గౌడ్,జిల్లా కార్యదర్శి అగస్య శంకర్ గౌడ్,మండల అధ్యక్షులు మురళి కార్యకర్తలు పాల్గొన్నారు.











## బహుజన స్టూడెంట్ యూత్ అసోసియేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత దుప్పట్లు పంపిణీ.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 22:**
బహుజన స్టూడెంట్ యూత్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి పెద్ద స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత దుప్పట్లో పంపిణీ కార్యక్రమం కి ముఖ్యఅతిథిగా బహుజన స్టూడెంటు యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పాలుట్ల రమణ మరియు రాష్ట్ర కార్యదర్శి పి రామకృష్ణ.
నంద్యాల పట్టణంలోఉన్న నిరాశ్రయులకు, ఈ చలికాలంలో ఎంతోమంది నిరాశ్రయులు ఇబ్బంది పడుతున్నారని వారు దుప్పట్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బహుజన స్టూడెంట్ యూత్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు నాగ పాములేటి, జిల్లా నాయకులు సురేంద్ర, అశోక్, సుజిత్, తదితరులు పాల్గొన్నారు.



## ఐ-బొమ్మ రవి కేసు దర్యాప్తు చేస్తున్న సైబర్ క్రైమ్ డీసీపీ కవిత వరంగల్‌కు బదిలీ

**వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా దార కవిత బదిలీ**

హైదరాబాద్, **నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**
తెలంగాణ రాష్ట్ర హోంశాఖ పోలీసు వ్యవస్థలో భారీగా బదిలీలు చేపట్టింది. తొమ్మిది మంది నాన్-కేడర్ ఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల్లో భాగంగా ఐ-బొమ్మ రవి కేసును దర్యాప్తు చేస్తున్న డీసీపీ దారా కవితను వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా బదిలీ చేశారు. ఐ-బొమ్మ రవి కేసు దర్యాప్తు కొనసాగుతుండగానే కవితను బదిలీ చేయడం గమనార్హం. హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగంలో డీసీపీగా ఉంటూ ఆమె పలు కీలక కేసులను దర్యాప్తు చేశారు. కవిత స్థానంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీగా అరవింద్ బాబును నియమించారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ఉన్న వై.వీ.ఎస్. సుచేంద్రను హైదరాబాద్ ఎస్బీ డీసీపీగా నియమించారు.
పెద్దపల్లి డీసీపీ పీ. కరుణాకర్‌ను ఇంటెలిజెన్స్ విభాగంలో ఎస్పీగా, సైబరాబాద్ ఎస్బీ డీసీపీ బి. సాయిశ్రీని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీగా, ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఎస్.వీ.ఎన్. శివరాంను ఏసీబీ ఎస్పీగా, ట్రాన్స్‌కో ఎస్పీగా పని చేస్తున్న జగదీశ్వర్ రెడ్డికి ఇంటెలిజెన్స్ విభాగంలో కొత్త బాధ్యతలు అప్పగించారు. ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఉన్న రవీంద్రరెడ్డిని గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా బదిలీ చేశారు. హైదరాబాద్ అడిషనల్ కమిషనర్‌గా ఉన్న అశోక్ కుమార్‌ని సీఐడీ ఎస్పీగా బదిలీ చేశారు.

# సుప్రీం తీర్పు..గవర్నర్ల వ్యవహారం

**నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**
పదవీ విరమణ చేయబోతున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బుధ, గురు వారాల్లో రెండు రాజ్యాంగ ధర్మాసనాలకు నేతృత్వం వహించి తీర్పులిచ్చారు. రాష్ట్రపతి న్యాయ సలహా కోరిన అంశంపై గురువారం ఏకాభిప్రాయంతో తీర్పు సంచలనంగానే పేర్కొనాలి. ఎందుకంటే తమిళనాడు కు సంబంధించిన పలు బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా తొక్కిపెడుతుండటంతో అక్కడి ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు గవర్నర్‌ను ఆదేశించింది. బిల్లులను తొక్కిపట్టే విధానాన్ని తప్పుబట్టింది. అయితే, గవర్నర్ మాత్రం బిల్లులను ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ ఈ ఏడాది ఏప్రిల్ 8న సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా పది బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టారని ప్రకటించింది. రాజ్యాంగ విధుల్లో విఫలయ్యారని, రాజ్యాంగబద్ధ పాలన కూలిపోయే పరిస్థితి కల్పించారని మండిపడింది. బిల్లులు తిప్పిపంపకుండా దగ్గర పెట్టుకోవడం కుదరదని చెప్పింది. తిప్పి పంపిన తర్వాత మళ్లీ శాసనసభ ఆమోదిస్తే గవర్నర్ ఆమోదించాల్సిందేనని స్పష్టం చేసింది. గవర్నర్‌కు పంపిన బిల్లులు ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మే 13న రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టును 14 ప్రశ్నలతో న్యాయ సలహా కోరింది. వాటికి సుప్రీంకోర్టు గురువారం సమాధానం ఇచ్చింది. వాదనల సమయంలో ఏప్రిల్ 8 నాటి సుప్రీంకోర్టు తీర్పును తోసిపుచ్చే ఉద్దేశం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పదేపదే చెప్పారు. గురువారం నాటి తీర్పు కాపీలోనూ... మరో తీర్పును తోసిపుచ్చేందుకు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సలహా కోరడాన్ని ఉపకరణంగా వాడటం కుదరదని పేర్కొంది. ప్రత్యేకించి కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు ఆయా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కొంత పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా బిల్లుల ఆమోదం విషయంలో వారు సకాలంలో నిర్ణయం తీసుకోవడం లేదు. లేదా తిప్పి పంపడం లేదు. ప్రధానంగా బెంగాల్, తమిళనాడు, తెలంగాణల్లో ఇలాంటి పరిస్థితులను చూశాం. అయితే రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లుల ఆమోదంలో గడువు విధించడం తగదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఇటీవలే తేల్చిచెప్పింది. ఈ తీర్పుతో ఇప్పుడు గవర్నర్ల వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నా ప్రశ్నించే అవకాశం లేకుండా పోయింది. అలాగే బిల్లులను సకాలంలో పంపాలన్న నిబంధన లేకపోతే వారు రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చెలాయిస్తారని తమిళనాడు, బెంగాల్ తదితర రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ దీనిపై చర్చించాల్సి ఉంది. గవర్నర్లకు ఉండే వెసలుబాటులోనూ సమయాభావన ఉండాలన్న దానిపై చర్చించాలి. అవసరమైతే చట్టపరంగా మార్పులకు శ్రీకారం చుట్టాలి. అప్పుడే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు ఆమోదం దక్కుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లుల ఆమోదంలో గవర్నర్ సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చని కూడా స్పష్టం చేసింది. అయితే, గవర్నర్ ఎటువంటి కారణం చెప్పకుండా నిరవధికంగా ఆలస్యం చేయడం తగదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం అభిప్రాయ పడింది. అటువంటి సమయంలో సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవా లని గవర్నర్‌ను న్యాయస్థానం ఆదేశించవచ్చని చెప్పింది. రాష్ట్రాల శాసన సభలు ఆమోదించి పంపించిన బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలిపే అంశానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక నిర్ణయాన్ని





వెలువరించింది. రాష్ట్రపతి, గవర్నర్లు తీసుకునే చర్యలు న్యాయస్థానాల పరిశీలనకు అతీతం కాదని చెబుతూనే రాజ్యాంగ అధినేతలకు బిల్లుల ఆమోదం కోసం గడువు విధించడం సరైంది కాదని స్పష్టం చేసింది. రాష్ట్రపతి రాజ్యాంగాధినేత కావడం వల్ల కొంత ఆలోచన చేయవచ్చు. కానీ గవర్నర్లు ఈ విషయంలో కొంత రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎందుకంటే బిల్లులను తొక్కిపెట్టి కాలయాపన చేయడం వల్ల తీసుకోవాల్సిన నిర్ణయాలు ఆలస్యం అవుతున్నాయి. సుప్రీం తీర్పు తరవాత తమిళనాడు సిఎం స్టాలిన్ కూడా స్పందించారు. గవర్నర్లకు సమయం ఉండాలని, నిర్దేవజత గడువు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం అవసరమైతే రాజ్యాంగ సవరణ జరగాలన్నారు. ఇకపోతే గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయని సుప్రీంకోర్టు తెలిపింది. ఒక బిల్లు గవర్నర్ దగ్గరికి వచ్చినప్పుడు అన్నీ పరిశీలించి సమ్మతి తెలియ జేయడం లేదా ఏదైనా సహేతుకమైన కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం చేయాలి. లేదా బిల్లును తిరస్కరించి తిరిగి అసెంబ్లీకి పంపడం చేయాలి. కానీ చాలా సందర్భాల్లో అలా జరగడం లేదు. తమిళనాడు గవర్నర్ రవి ఇలాంటి నిబంధనలు పక్కన పెట్టారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న సమయంలో తమిళసై సైతం ఇదే ధోరణితో ఉన్నారు. ప్రభుత్వాలు ఏదైనా నిర్ణయం తీసుకుంటే సకాలంలో ఔనని లేదా కాదని చెబితే బాగుండేది. కానీ దానిపై సమాధానం ఇవ్వక పోవడం అన్నది, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేదే తప్ప మరోటి కాదు. అయితే ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో రాజ్యాంగంలోని 200 నిబంధన కింద గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారని, అటువంటి సమయంలో న్యాయస్థానాలు గడువు విధించడం సరికాదని సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయ పడింది. బిల్లులకు ఆమోదం తెలిపేటప్పుడు కానీ, ఆమోదాన్ని నిలిపివేసే సమయంలో కానీ గవర్నర్ తన సొంత విచక్షణ ప్రకారం వ్యవహరించవచ్చని కూడా సూచించింది. అలాంటి సమయాల్లో మంత్రి మండలి సలహా ప్రకారం నడుచుకోవాల్సిన అవసరం లేదు. అయితే, సుదీర్ఘకాలం వివరించలేని కారణాల వల్ల ఒక బిల్లుపై నిర్ణయం తీసుకోకపోతే సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవలసిందిగా కోర్టు గవర్నర్‌కు పరిమితమైన ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపింది. 361 అధికరణ కింద వారికి రక్షణ కవచం ఉన్నప్పటికీ సుదీర్ఘమైన ఆలస్యం జరిగినప్పుడు హేతుబద్ధమైన సమయంలో బిల్లులను ఆమోదించేందుకు, తిరిగి పంపేందుకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపింది. ఇకపోతే తన పరిశీలనకు వచ్చిన ప్రతి బిల్లుపై రాష్ట్రపతి రాజ్యాగంలోని 143వ అధికరణం కింద సుప్రీంకోర్టు సలహా కోరనవసరం లేదు. గవర్నర్లు నిరవధికంగా ఒక బిల్లును తమ వద్ద ఉంచుకోరాదు అనేదే ప్రధానం. అందువల్ల పరిమితమైన న్యాయ సమీక్ష ఉండవచ్చని రాజ్యాంగ ధర్మాసనం తన ఏకగ్రీవ తీర్పులో అభిప్రాయపడింది. రాజ్యాంగంలో బిల్లును సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని ఉన్నప్పటికీ దాన్ని గవర్నర్లకు, రాష్ట్రపతికి డెడ్‌లైన్ పెట్టేందుకు రాజ్యాంగం ఇచ్చిన అనుమతిగా భావించనక్కరలేదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. డెడ్‌లైన్ పెట్టి, ఆలోగా ఆమోదం ఇవ్వకపోతే లభించినట్లుగానే భావించడం రాజ్యాంగంలోని అధికారాల విభజన సూత్రానికి భంగం కలిగిస్తుందని తెలిపింది. మొత్తంగా గవర్నర్లకు ఇప్పుడు విచక్షణ ఉందని తేల్చింది. అంటే బిల్లులను ఎంతకాలమైనా పెండింగ్‌లో పెట్టుకునే అవకాశం ఉంది. అయితే అది ఎంతకాలం అన్న చర్చ జరగాలి. లేదా దానికి కూడా పరిమిత కాలం అంటూ ఉండాలి. అప్పుడే గవర్నర్ల పెత్తనం అతిగా ఉండదు. తమిళనాడు వ్యవహారం, సుప్రీం తీర్పు నేపథ్యంలో గవర్నర్లకు సంబంధించి తప్పకుండా చర్చచేయాల్సి ఉంది. ఇందుకు పార్లమెంట్ పూనుకోవాలి. ఇలాంటి విషయాల్లో విపక్షపార్టీ సభ్యులు చర్చకు పట్టుబట్టాలి. అప్పుడు సమస్యకు మార్గం దక్కగలదు.

## కవులు రచయితలు కళాకారుల సేవలు దేశ ఔన్నత్యానికి ప్రతీకలు..

### సాంస్కృతిక కళా సంపదలు భావితరానికి వన్నెతగ్గని వనరులు..

### కళాకారులను ప్రోత్సహించడంలో భాగస్వాములు కండి..

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

### మండలి బుద్ధ ప్రసాద్‌లు

విజయవాడ, **నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి** కవులు రచయితలు కళాకారులు అందిస్తున్న సేవలు దేశ ఔన్నత్యానికి ప్రతీకలని భారత సంస్కృతి సాంప్రదాయాలు భావితరానికి తరగని వనరులవంటివని కవులు, రచయితలు, కళాకారులను ప్రోత్సహించడంలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కొహాన్స్ సంస్థ సహకారంతో విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను శనివారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణ రావు అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కవులు, రచయితలు, కళాకారులు, కార్టూనిస్టులను అందించిన సాంస్కృతి రచన కళా సంపదలు భావితరానికి తరగని వనరులలాంటివన్నారు. రచయితలు కళాకారులు కళలను ఆదరించిన ప్రదేశం ఎప్పటికి ప్రజ్వరిల్లుందన్నారు. ఆధునిక జీవనశైలిలో మసకబారుతున్న కళలు, సాంస్కృతిక కళా సంపదను పరిరక్షించుకుంటూ వాటిని భావితరాలకు అమూల్యమైన వారసత్వ సంపదగా అందించేందుకు కవులు, రచయితలు, కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మల్లెతీగ సాహిత్య సేవ సంస్థ కవులు రచయితలు కళాకారులు కార్టూనిస్టులను ప్రోత్సహించేందుకు కథలు




కవితలు కార్టూల పోటీలను నిర్వహించి జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించేందుకు ముందుకు వచ్చిన మల్లెతీగ సాహిత్య సేవ సంస్థ కన్వీనర్ కలిమిశ్రీ ఇతర సభ్యులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు ముందుకు వచ్చేవారికి జిల్లా యంత్రాంగం తరుపున పూర్తి సహాయ సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ గొప్ప సాంస్కృతిక కేంద్ర బిందువైన విజయవాడ నగరం కవులు రచయతలు కళాకారులకు పుట్టినిల్లువంటిదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన కూచిపూడి నృత్యం ఉమ్మడి కృష్ణాజిల్లాకు కేంద్ర బిందువుకావడం జ్ఞాన పీఠం అవార్డు గ్రహీతలు, గాయక రత్నాలు, ఘన చరిత్ర కలిగిన ఎందరో జానపద కూచిపూడి భరతనాట్య కళాకారులు రచయతలు కవులు సినిరంగ కళాకారులు పుట్టినట్టువంటి గడ్డపై జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించడం గర్వకారణమన్నారు. తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రప్రంచ వ్యాప్తంగా చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ ఎన్‌టి రామారావు స్ఫూర్తితో రాష్ట్ర ముఖ్యమంత్రి సాంస్కృతిక రంగాన్ని ప్రాధాన్యతనిచ్చి కవులు రచయతలు కళాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సాంస్కృతిక శాఖకు మరిన్ని నిధులను కేటాయించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కళా రంగానికి మరింత వైభవాన్ని తీసుకువచ్చేలా తనవంతు కృషిచేస్తానన్నారు. తెలుగు భాషను పరిరక్షించేందుకు బడి ఏలుబడిలలో తెలుగు భాషను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా కార్టుల పోటీలలో గెలుపొందిన కార్టూన్ల ప్రదర్శన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆలరించాయి. కార్యక్రమంలో ఏపి సృజనాత్మక మరియు సంస్కృతి సమితి సిఇఓ రేగుళ్ళ మల్లికార్జున రావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, ప్రసిద్ధ రచయిత డా. ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు శ్రీమతి మంజులూరి కృష్ణ కుమారి, కృష్ణా జిల్లా రచయతల సంఘం ప్రధాన కార్యదర్శి డా. జి . పూర్ణచంద్, సాహితీ ఫౌండేషన్ చైర్మన్ చిన్ని నారాయణ రావు, పుట్ట సురేంద్రబాబు కవులు రచయతలు కార్టూనిస్టులు సాంస్కృతిక సాహిత ప్రియులు కళాకారులు పాల్గొన్నారు.

----------

## సైబర్ నేరాలపై అవగాహన

### సైబర్ నేరగాళ్ల బెదిరంపులకు లొంగవద్దు -హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జన్నార్

హైదరాబాద్, **నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**
సైబర్ నేరాలను అడ్డుకునేందుకు సరికొత్త కార్యక్రమానికి హైదరాబాద్ సీపీ సజ్జనార్ శ్రీకారం చుట్టారు. చార్మినార్ వద్ద నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ మీడియాతో మాట్లాడుతూ.. చారిత్రాత్మక చార్మినార్ వద్ద ప్రతి శని, మంగళవారం గడపగడపకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. చార్మినార్ వద్ద సైబర్ క్రైమ్‌పై అవేర్‌నెస్ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించే ప్రయత్నం చేశామన్నారు. అవగాహన లేక చాలామంది సైబర్ నేరాల బారిన పడుతున్నారని తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే ప్రతి రోజు కోటి రూపాయలు సైబర్ నేరాల్లో పోగొట్టుకుంటున్నారని వెల్లడించారు. ఓటీపీ ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అందరూ అవగాహన, అప్రమత్తత కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరస్తులు కాల్ చేసి బెదిరిస్తే భయపడ వద్దన్నారు. భయపడితే అది సైబర్ నేరస్తుల బలం అవుతుందని చెప్పుకొచ్చారు. ప్రైవేట్ ఫోటోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయవద్దని.. అలా చేస్తే మిమ్మల్ని ట్రాప్ చేసి మోసం చేసే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ సింబా పేరిట వాలంటరీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చామని.. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీ సజ్జనార్ పిలుపునిచ్చారు.

## మరోమారు షాక్ ఇచ్చిన బంగారం ధరలు

### ఒక్కరోజే పది గ్రాములపై 1800 పెరుగుదల

హైదరాబాద్, **నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి** బంగారం కొనాలనుకునే వారికి ధరలు వరుస షాక్‌లు ఇస్తున్నాయి. తగ్గినట్టే తగ్గి భారీగా పెరుగుతున్నాయి. బంగారం ధరలుగతం పోల్చుకుంటే శనివారం భారీగా పెరిగాయి. ఒక్క రోజులోనే ఏకంగా పది గ్రాములపై 1800 రూపాయలు పెరిగింది. శుక్రవారం పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,23,980 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 22 క్యారెట్ల బంగారం ధర 1,13,650 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 18 క్యారెట్ల ధర 92,900 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి..పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,25,840 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల ధర 1,15,350 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 18 క్యారెట్ల బంగారం ధర 94,380 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. 100 గ్రాములపై 300, కేజీపై 3 వేల రూపాయలు పెరిగింది. నిన్న(శుక్రవారం) 100 గ్రాముల వెండి ధర 16,100 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,61,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో 100 గ్రాముల వెండి ధర 16,400 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ ధర 1,64,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది.

------

# పవన్ యాక్షన్ ప్లాన్.. సొంత నియోజకవర్గం నుంచే మార్పు మొదలు

**నవంబర్ 22 ఆంధ్ర ప్రగతి**
డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దూకుడు పెంచారు. తన నియోజకవర్గం పరిధిలోని ఉప్పాడ మత్స్యకారుల సమస్యలపై రూపొందించిన 100 రోజుల ప్రణాళికను అమలు చేసేందుకు రోడ్ మ్యాప్ రెడీ చేశారు. తీర ప్రాంతంలో అంతరించిపోతున్న మత్స్య సంపదను రక్షించడంతోపాటు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల కల్పనపైనా దృష్టి సారించినట్లు పవన్ వెల్లడించారు. విశాఖ సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, మత్స్య శాఖ సూచనల మేరకు రూపొందించిన ప్రత్యేక ప్రణాళికలను అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పవన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కోస్టల్ రీజైలెన్స్ పథకం ద్వారా ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు రూ.2 కోట్లతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పవన్ వివరించారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా పవన్ లేఖ రాశారు. 100 రోజుల ప్రణాళక అమలులో భాగంగా మత్స్య సంపద పెంపొందించడం, వేట నైపుణ్యాన్ని పెంచడం, ప్రత్యేక రీఫ్ ల ఏర్పాటు, ప్రత్యామ్నయ ఆదాయ వనరుల సృష్టి తదితర అంశాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మన మత్స్యకారులను తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు తీసుకువెళ్లి అక్కడ విజయవంతమైన కృత్రిమ రీఫ్ కల్చర్, కోస్టల్ టూరిజం యూనిట్ల సందర్శనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సంప్రదాయ వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల సమస్య పరిష్కారంపై దృష్టి సారించామని, రాష్ట్ర చరిత్రలో తొలిసారి సముద్రంలో చేపల సంఖ్యను పెంపొందించే చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఉప్పాడ, కాకినాడ తీర ప్రాంతాల్లో 50 వేల పండుగప్ప పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టామని, భవిష్యత్తులో ఉప్పు నీటిలో పెరిగే టైగర్ రొయ్య పిల్లలను కూడా తీర ప్రాంతాల్లో విడిచిపెట్టే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. తీర ప్రాంత మత్స్యకారులు ఇప్పటి వరకు 12 నాటికల్ మైళ్ల దూరం వరకు మాత్రమే వేటాడే అవకాశం ఉందని, ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఈ పరిధిని 200 నాటికల్ మైళ్ల వరకు విస్తరించిందని పవన్ వెల్లడించారు. డీప్ సీ ఫిషింగ్ ద్వారా మత్స్యకార సోదరులు మంచి ధర లభించే టూనా చేపలను పట్టుకునేందుకు వీలు కలుగుతుందని పవన్ తెలిపారు. కోనపాపపేటలో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం ఉప్పాడ తీర



ప్రాంత అభివృద్ధికి చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా కోస్టల్ రీజైలెన్స్ స్కీమ్ కింద కోనపాపపేటకు రూ. 2 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో తుపాను లాంటి విపత్తుల నుంచి తీర ప్రాంత గ్రామాల ప్రజలకు రక్షణ కల్పించేందుకు వీలుగా మల్టీపర్పస్ కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తున్నారు. ఈ కమ్యూనిటీ హాళ్లలో ఆర్.ఒ. వాటర్ ప్లాంట్లు, చేపలు ఎండబెట్టుకునేందుకు వీలుగా మూడు ఫిష్ డ్రైయింగ్ ఫ్లాట్ ఫామ్స్ నిర్మిస్తున్నారు. వేటకు వెళ్లిన మత్స్యకారులను సముద్రంలో ట్రాక్ చేసేందుకు వీలుగా జీపీఎస్ సిస్టం, మత్స్య సంపదను నిల్వ చేసుకునేందుకు ఐస్ బాక్సులు ఏర్పాటు చేయబోతున్నామని పవన్ వెల్లడించారు. తీర ప్రాంతంలో టూరిజం హాట్ స్పాట్లు తీర ప్రాంత మత్స్యకారులకు వేటతోపాటు ప్రత్యామ్నాయ ఆదాయ వనరులపైనా దృష్టి సారించినట్లు పవన్ తెలిపారు. మత్స్యకారుల్లోని అద్భుతమైన ఈత సామర్థ్యాన్ని వినియోగించుకుంటూ కేరళ తరహాలో తీర ప్రాంత పర్యటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. స్పీడ్ బోటింగ్, స్కూబా డైవింగ్ తదితర జల క్రీడల్లో మత్స్యకార యువతకు శిక్షణ ఇప్పించడం ద్వారా మన రాష్ట్ర తీర ప్రాంతాలను టూరిజం హాట్ స్పాట్లుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. కాకినాడ తీర ప్రాంతం నుంచి కొంత మంది మత్స్యకారులను కేరళ తీసుకువెళ్లి అక్కడ మత్స్యకారులు నిర్వహిస్తున్న ఎకో టూరిజం స్పాట్ల వద్ద శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. చెన్నై హార్బర్ సమీపంలోని తిరువత్రియుర్ కుప్పం తీరంతో విజయవంతంగా నిర్వహిస్తున్న కృత్రిమ రీఫ్ కల్చర్ సందర్శనకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

# 2025 యాషెస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం






**తొలి టెస్టులో ఇంగ్లాండ్‌పై ఘన విజయం**

**ఆసీస్‌ను ఊచకోత కోసిన ట్రావిస్ హెడ్**

**10 వికెట్లతో సత్తా చాటిన మిచెల్ స్టార్క్**

ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. 205 పరుగుల లక్ష్యఛేదనలో భాగంగా రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్.. ట్రావిస్ హెడ్(83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్స్‌లతో 123) విధ్వంసకర శతకంతో 28.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి విజయాన్ని కైవసం చేసుకుంది.రెండు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో ట్రావిస్ హెడ్ అసాధారణ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై టీ20 తరహా బ్యాటింగ్‌తో విరుచుకుపడ్డాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగి 36 బంతుల్లోనే హాఫ్ సెంచరీ నమోదు చేసిన ట్రావిస్ హెడ్.. 69 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అతని దూకుడైన బ్యాటింగ్‌తో హోరాహోరీ తప్పదనుకున్న మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది. అతనికి తోడుగా మార్నస్ లబుషేన్(49 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 51 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు.ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ ఒక్కడే రెండు వికెట్లు తీయగా.. మిగతా బౌలర్లు తేలిపోయారు. ఈ విజయంతో ఐదు టెస్ట్‌ల యాషెస్ సిరీస్‌లో ఆసీస్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య రెండో టెస్ట్ నవంబర్ 29 నుంచి కాన్‌బెర్రా వేదికగా ప్రారంభం కానుంది.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకే కుప్పకూలింది. హ్యారీ బ్రూక్(61 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 52) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. ఓలీ పోప్(58 బంతుల్లో 4 ఫోర్లతో 46), జెమీ స్మిత్(22 బంతుల్లో 6 ఫోర్లతో 33) పర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(7/58) ఏడు వికెట్లతో నిప్పులు చెరిగాడు. బ్రెండన్ డొగ్గెట్(2/27) రెండు వికెట్లు తీయగా.. కామెరూన్ గ్రీన్‌కు ఓ వికెట్ దక్కింది. అనంతరం ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులకు ఆలౌటైంది. అలెక్స్ క్యారీ(26), కామెరూన్ గ్రీన్(24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ట్రావిస్ హెడ్(21) విఫలమయ్యాడు. బెన్ స్టోక్స్(5/23) ఐదు వికెట్లు తీయగా.. బ్రైడన్ కార్స్ (3/45) మూడు వికెట్లు పడగొట్టాడు. జోఫ్రా ఆర్చర్(2/11)కు రెండు వికెట్లు దక్కాయి.ఇక 40 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ 164 పరుగులకు ఆలౌటైంది. గస్ అట్కిన్సన్(32 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 37), ఓలీ పోప్(57 బంతుల్లో 2 ఫోర్లతో 33) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(3/55)తో పాటు స్కాట్ బోలాండ్(4/33) నాలుగు వికెట్లు పడగొట్టాడు.బ్రెండన్ డొగ్గెట్(3/51) మూడు వికెట్లు తీసాడు. దాంతో ఆసీస్ ముందు 205 పరుగుల లక్ష్యం నమోదైంది. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న ఈ వికెట్‌పై ఈ లక్ష్యాన్ని ఛేదించడం ఆసీస్‌కు కష్టమవుతుందని అంతా అనుకున్నారు. కానీ ట్రావిస్ హెడ్ ఓపెనర్‌గా బరిలోకి దిగి టీ20 బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు. ట్రావిస్ హెడ్ ఈ టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఐదో స్థానంలో బ్యాటింగ్ చేసి కేవలం 21 పరుగులే చేశాడు. కానీ, చివరి ఇన్నింగ్స్‌లో ఓపెనింగ్ చేసే అవకాశం రావడంతో, దాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. హెడ్ మొదటి నుంచే వేగంగా పరుగులు చేశాడు, పెర్త్ పిచ్‌పై కష్టంగా కనిపించిన 205 పరుగుల టార్గెట్‌ను సులభతరం చేశాడు. కేవలం 36 బంతుల్లోనే హెడ్ తన హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. ఇది యాషెస్ చరిత్రలో మూడవ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డ్. ఆ తర్వాత కూడా హెడ్ ఆగకుండా కేవలం 69 బంతుల్లోనే తన సెంచరీని పూర్తి చేశాడు. ఈ వేగంతో ఆస్ట్రేలియా తరపున టెస్టుల్లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన వారి జాబితాలో హెడ్ సంయుక్తంగా మూడో స్థానానికి చేరుకున్నాడు. అలాగే, టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే ఇది ఐదవ వేగవంతమైన సెంచరీ రికార్డు.ట్రావిస్ హెడ్ చేసిన ఈ సెంచరీ యాషెస్ సిరీస్ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. యాషెస్ సిరీస్ చరిత్రలో ఇది రెండవ అత్యంత వేగవంతమైన సెంచరీ. హెడ్ తన 69 బంతుల సెంచరీతో గిల్‌బర్ట్ జెస్సోప్ రికార్డును బద్దలు కొట్టాడు. జెస్సోప్ 1902లో ఆస్ట్రేలియాపై 76 బంతుల్లో సెంచరీ కొట్టాడు. యాషెస్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డు మాత్రం ఆడం గిల్‌క్రిస్ట్ పేరిట ఉంది. అతను 2006-07 యాషెస్‌లో కేవలం 57 బంతుల్లోనే సెంచరీ సాధించాడు.



# హల్దీ వేడుకలో స్మృతి మంధాన డ్యాన్స్

భారత మహిళా క్రికెట్ జట్టు వైస్-కెప్టెన్, డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన పెళ్లి సందడి మొదలైంది. రేపు (నవంబర్ 23) మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్‌ను పెళ్లి చేసుకోబోతున్న స్మృతి మంధాన, తాజాగా జరిగిన తన హల్దీ వేడుకతో అభిమానులను ఆకట్టుకుంది. ఈ వేడుకలో మంధాన తన భారతీయ టీమ్ మేట్స్‌తో కలిసి ఉత్సాహంగా డ్యాన్స్ చేసింది. అంతా పసుపు రంగు దుస్తుల్లో మెరిసిపోతూ ఆ వేడుకకు ప్రత్యేక కళ తీసుకొచ్చారు. మంధాన హల్దీ వేడుక డ్యాన్స్ ఫ్లోర్‌పై ఏకంగా ఏడుగురు భారత క్రికెట్ స్టార్లు సందడి చేశారు. షఫాలీ వర్మ, రిచా ఘోష్, శ్రేయాంక పాటిల్, రేణుకా సింగ్, శివాలి షిండే, రాధా యాదవ్, జెమీమా రోడ్రిగ్స్ వంటి ఆటగాళ్లు అందరూ పసుపు దుస్తుల్లో వచ్చి హల్దీ థీమ్‌కు మ్యాచ్ అయ్యారు. అందరూ కలిసి ఉత్సాహంగా పెళ్లి పాటలకు డ్యాన్స్ చేస్తూ, మంధాన పెళ్లి వేడుకను పండుగలా మార్చేశారు. ఈ స్నేహం, టీమ్ స్పిరిట్ చూడముచ్చటగా ఉంది. వరల్డ్ కప్ విన్నర్ షఫాలీ వర్మ, ఈ డ్యాన్స్ వీడియోను తన సోషల్ మీడియాలో షేర్ చేస్తూ దానికి లడ్కీ వాలే(వధువు తరపువారు) అని క్యాప్షన్ ఇచ్చింది. ఈ వేడుక కేవలం పసుపు వేడుక మాత్రమే కాదు, ఇదొక చిన్న క్రికెట్ రీయూనియన్ లా మారింది. ఇటీవల మహిళల వరల్డ్ కప్ గెలిచిన జట్టులోని సభ్యులుషఫాలీ, రాధా, రిచా, రేణుక, జెమీమా అందరూ కలిసి మంధాన పెళ్లి వేడుకలో పాల్గొనడం హైలైట్‌గా నిలిచింది. మహారాష్ట్ర ప్రీమియర్ లీగ్‌లో స్మృతి మంధాన సహచర క్రీడాకారిణి అయిన శివాలి షిండే కూడా ఈ సెలబ్రేషన్‌లో భాగమైంది. చాలా రోజుల తర్వాత పబ్లిక్‌గా కనిపించిన శ్రేయాంక పాటిల్ కూడా ఈ వేడుకలో పాల్గొనడం అభిమానులను ఆకట్టుకుంది.స్మృతి మంధాన గురువారం రోజు తన టీమ్ మేట్స్‌తో కలిసి బాలీవుడ్ పాట సంఝో హెూ హీ గయాకు డ్యాన్స్ చేస్తూ సరదాగా తన ఎంగేజ్‌మెంట్‌ను కన్ఫర్మ్ చేసింది. శుక్రవారం రోజు పలాష్ ముచ్చల్ ఒక ఎమోషనల్ వీడియోను షేర్ చేశాడు. ఆ వీడియోలో భారత్ వరల్డ్ కప్ గెలిచిన ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం పిచ్‌పై మంధాన కళ్లకు గంతలు కట్టి తీసుకొచ్చి, మోకాలిపై కూర్చుని ఉంగరం ఇచ్చి ప్రపోజ్ చేశాడు. ఆమె యస్ చెప్పింది అంటూ పలాష్ ఆ వీడియోకు క్యాప్షన్ ఇచ్చాడు.కాగా స్మృతి మంధాన ఇటీవల ముగిసిన వరల్డ్ కప్‌లో అద్భుతంగా ఆడింది. ఆమె 9 ఇన్నింగ్స్‌లలో 434 పరుగులు చేసి, ఒక ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత క్రీడాకారిణిగా నిలిచింది. ఫైనల్‌లో కూడా 45 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడి, భారత్ టైటిల్ గెలవడంలో ముఖ్యపాత్ర పోషించింది.



# ఎలైట్ లిస్ట్‌లో రిషభ్ పంత్



గువాహటి వేదికగా భారత్- సౌతాఫ్రికా మధ్య రెండో టెస్టు ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన సౌతాఫ్రికా బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా ఈ టెస్టుకు దూరం కావడం వల్ల, రిషభ్ పంత్ పగ్గాలు అందుకున్నాడు. ఈ క్రమంలో పంత్ అరుదైన ఘనత సాధించాడు. భారత్‌కు టెస్టుల్లో సారథ్యం వహించిన 38వ కెప్టెన్‌గా నిలిచాడు.ఈ టెస్టుకు కెప్టెన్‌గా ఎంపిక అవ్వడంపై పంత్ మాట్లాడాడు. ఇది తనకు ఓ గౌరవం అని చెప్పాడు. 'కెప్టెన్‌గా ఒకే టెస్టుకు సారథ్యం వహించడం బాగా అనిపించదు. కానీ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు బీసీసీఐకి కృతజ్ఞతలు. ఏ పరిస్థితుల్లో అయినా సరే జట్టును నడిపించడం గర్వకారణమే. కొన్నిసార్లు సంప్రదాయబద్ధంగా నిర్ణయాలు తీసుకోవడం బాగుంటుంది. మరికొన్నిసార్లు కొత్తగా ట్రై చేస్తే మంచి ఫలితాలు అందుకోవచ్చు. కానీ ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేయడం తెలిసి ఉండాలి. ఆటను ఆస్వాదిస్తూ జట్టు కోసం నేను చేయాల్సింది వంద శాతం చేస్తా' అని పంత్ మ్యాచ్‌కు ముందు ప్రెస్ కాన్ఫిరెన్స్‌లో పేర్కొన్నాడు.ఈ టెస్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడంతో పంత్ అరుదైన రికార్డు సాధించాడు. టెస్టుల్లో భారత్ జట్టుకు సారథ్యం వహించిన రెండో వికెట్ కీపర్, బ్యాటర్‌గా నిలిచాడు. పంత్ కంటే ముందు మహేంద్రసింగ్ ధోనీ మాత్రమే (వికెట్ కీపర్, బ్యాటర్) టీమ్‌ఇండియాను టెస్టుల్లో నడిపించాడు. 100ఏళ్ల చరిత్ర ఉన్న భారత టెస్టు జట్టుకు ఈ ఇద్దరు వికెట్ కీపర్లే కెప్టెన్సీ వహించిన ఘనత అందుకున్నారు.టెస్టుల్లో అత్యధిక ప్లేయర్లు కెప్టెన్‌గా ఉన్న నాలుగో జట్టుగా భారత్ కొనసాగుతోంది. 1928లో భారత్ ఆడిన తొలి టెస్టు నుంచి ఇప్పటిదాకా జట్టుకు 38 మంది ఆటగాళ్లు కెప్టెన్లుగా వ్యవహరించారు. ఈ లిస్ట్‌లో ఇంగ్లాండ్ 82 మంది కెప్టెన్లతో టాప్‌లో ఉంది.

# ఈ ఓటమితో ఎంతో విలువైన పాఠాన్ని నేర్చుకున్నాం

**● ఇదో అద్భుతమైన క్రికెట్ మ్యాచ్: జితేష్ శర్మ**



ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2025 టీ20 టోర్నీలో టీమిండియా పోరాటం ముగిసింది. శుక్రవారం బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్లో జితేష్ శర్మ సారథ్యంలోని భారత్-ఏ సూపర్ ఓవర్‌లో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఆద్యాంతం హెూరాహెూరీగా సాగిన ఈ మ్యాచ్.. ఆఖరికి బంగ్లాదేశ్ వశమైంది. అయితే సెమీఫైనల్లో తమ జట్టు ఓటమికి పూర్తి బాధ్యత తనదేనని కెప్టెన్ జితేష్ శర్మ తెలిపాడు. తానే మ్యాచ్‌ను ముగించాల్సిందని అభిప్రాయపడ్డాడు. తన బ్యాటింగ్ వైఫల్యంతో పాటు తప్పుడు నిర్ణయాల కారణంగానే భారత్-ఏ ఫైనల్ చేరలేకపోయిందని అంగీకరించాడు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్-ఏ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 194 పరుగులు చేసింది. అనంతరం భారత్ కూడా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 194 పరుగులే చేసింది. దాంతో సూపర్ ఓవర్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే సూపర్ ఓవర్‌లో విధ్వంసకర బ్యాటర్, చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీని బ్యాటింగ్ పంపించకుండా జితేష్ శర్మ, రమణ్‌దీప్ సింగ్, అషుతోష్ శర్మలు బరిలోకి దిగారు.సూపర్ ఓవర్‌లో వరుసగా రెండు బంతుల్లో జితేష్ శర్మ, అషుతోష్ శర్మలు ఔటవ్వడంతో భారత్-ఏ ఒక్క పరుగు చేయకుండానే ఆలౌటైంది. రూల్స్ ప్రకారం సూపర్ ఓవర్‌లో రెండు వికెట్లు కోల్పోతే ఆలౌటైనట్లు. అనంతరం బంగ్లాదేశ్.. తొలి బంతికే వికెట్ కోల్పోగా.. రెండో బంతిని సుయాష్ శర్మ వైడ్ వేయడంతో విజయం లాంఛనమైంది. ఈ టోర్నీలో అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్ ఆర్యలను సూపర్ ఓవర్‌లో ఆడించకపోవడంపై విమర్శలు వచ్చాయి. ఈ ఇద్దర్నీ ఆడించి ఉంటే భారత్ గెలిచేదనే అభిప్రాయం వ్యక్తమైంది. మ్యాచ్ అనంతరం మాట్లాడిన జితేష్ శర్మ.. వైభవ్ సూర్యవంశీని సూపర్ ఓవర్‌లో ఆడించకపోవడం వెనుక ఉన్న కారణాన్ని వెల్లడించాడు. ఈ ఓటమికి తనదే పూర్తి బాధ్యత అని కూడా చెప్పాడు. 'మా జట్టులో వైభవ్ సూర్యవంశీ, ప్రియాన్ష్ ఆర్య పవర్ ప్లే ఆడటంలో మాస్టర్లు. డెత్ ఓవర్లలో నాతో పాటు అషుతోష్ శర్మ, రమణ్‌దీప్‌లు భారీ షాట్లు ఆడగలరు. ఈ క్రమంలోనే సూపర్ ఓవర్ లైనప్‌ను జట్టుగా నిర్ణయించాం. కానీ ఎవర్నీ ఆడించాలనే తుది నిర్ణయం మాత్రం నేను తీసుకున్నా. ఇదో అద్భుతమైన క్రికెట్ మ్యాచ్. ఈ ఓటమితో ఎంతో విలువైన పాఠాన్ని నేర్చుకున్నాం. ఈ ఓటమికి పూర్తి బాధ్యత నాదే. జట్టులో సీనియర్ ఆటగాడిగా నేను ఈ మ్యాచ్‌ను ముగించాల్సింది. ఈ టోర్నీలో ఎన్నో విషయాలను నేర్చుకున్నాం. ఈ కుర్రాళ్లు ఏదో ఒక రోజు భారత్‌కు ప్రపంచకప్ అందిస్తారు. ప్రతిభ విషయంలో మా కుర్రాళ్లు ఆకాశాన్ని తాకుతున్నారు. ఈ టోర్నీ వారికి నేర్చుకోవడానికి, అనుభవాన్ని గడించడానికి ఉపయోగపడింది.'అని జితేష్ శర్మ చెప్పుకొచ్చాడు.

# ట్రావిస్ హెడ్ మా ఆశలను చిదిమేశాడు

**● ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వెల్లడి**



ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ విధ్వంసకర బ్యాటింగ్‌తోనే యాషెస్ సిరీస్‌లో శుభారంభం అందుకోలేకపోయామని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తెలిపాడు. ఈ మ్యాచ్ పూర్తిగా తమ నియంత్రణలో ఉందని భావించామని, కానీ ట్రావిస్ హెడ్ తనదైన బ్యాటింగ్‌తో తమ విజయవకాశాలను లాగేసుకున్నాడని చెప్పాడు.పెర్త్ వేదికగా శనివారం ముగిసిన తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. బౌలర్లు ఆధిపత్యం చెలాయించడంతో రెండు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో ట్రావిస్ హెడ్(83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్స్‌లతో 123) విధ్వంసకర శతకంతో చెలరేగాడు. టీ20 తరహా బ్యాటింగ్‌తో హెూరాహెూరీ తప్పదని భావించిన మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించాడు.ఈ మ్యాచ్ అనంతరం తమ ఓటమిపై స్పందించిన బెన్ స్టోక్స్.. ట్రావిస్ హెడ్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. 'ఈ పరాజయంతో షాక్‌కు గురయ్యాను. ట్రావిస్ హెడ్ అద్భుతమైన ప్రదర్శన కనబర్చాడు. దూకుడుగా ఆడాడు. ఇది ఓ గొప్ప ఇన్నింగ్స్. ఆసీస్ ఆటగాళ్లు చాలా ధైర్యంగా ఆడి.. మ్యాచ్‌ను తమ నియంత్రణలోకి తీసుకున్నారు. క్రీజులో సెట్ అయితే భారీ ఇన్నింగ్స్ ఆడేందుకు ప్రయత్నించాలి. ట్రావిస్ హెడ్ తన విధ్వంసంతో మా ఆశలను చిదిమేశాడు. ఈ పిచ్‌పై రిస్క్ తీసుకొని ఆడినవారికే ఆశించిన ఫలితం దక్కింది. ముఖ్యంగా బౌలర్లపై ఒత్తిడి తెచ్చినవారే పరుగులు చేయగలిగారు.ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేసేందుకు మేం మూడు, నాలుగు ప్రణాళికలను ప్రయత్నించాం. కానీ అతను ఓ ఎక్స్‌ప్రెస్‌లా దూసుకుపోయాడు. అతన్ని ఆపడం చాలా కష్టమైంది. ఈ మ్యాచ్‌లో ఓడినా తొలి ఇన్నింగ్స్‌లో మేం బౌలింగ్ చేసిన విధానం అద్భుతంగా ఉంది. తొలి రోజు ఆటలో చాలా జరిగింది. బౌలర్లకు కలిసొచ్చింది. ఈ మ్యాచ్ పూర్తిగా మా నియంత్రణలోనే ఉందని భావించాను. కానీ అనూహ్య పరాజయం ఎదురైంది. ఈ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నా. మాకు ఇంకా నాలుగు మ్యాచ్‌లు ఉన్నాయి. తదుపరి మ్యాచ్‌కు చాలా సమయం ఉంది. ఆ మ్యాచ్ గెలిచేందుకు శ్రమిస్తాం.'అని బెన్ స్టోక్స్ చెప్పుకొచ్చాడు.

# ప్రభాస్ ఫౌజీపై ప్రీక్వెల్ ఊహాగానాలు...




ఇప్పటి వరకు రెబల్ స్టార్ 'ప్రభాస్' సీక్వెల్ మూవీస్ మాత్రమే చేశారు. రెండు భాగాలుగా వచ్చిన 'బాహుబలి' భారీ విజయాన్ని సాధించగా.. నెక్ట్స్ కల్కి 2, సలార్ 2 రెడీ అవుతున్నాయి. ఈ లిస్ట్‌లో రాజాసాబ్ కూడా ఉంది. అయితే ఇవన్నీ సీక్వెల్స్ మాత్రమే. ఇప్పుడు ఓ సినిమాకు ప్రీక్వెల్ ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న సినిమాల్లో 'ఫౌజీ' కూడా ఒకటి. సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగష్టులో ఈ సినిమా రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ వారు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఫౌజీ చిత్రానికి ప్రీక్వెల్ చేసే ప్లానింగ్‌లో ఉన్నారట రాఘవపూడి. ఇప్పటి వరకు వచ్చిన ఫౌజీ అవుట్ పుట్ పట్ల ప్రభాస్ చాలా హ్యాపీగా ఉన్నారట. హను వర్క్‌కు ఫిదా అవుతున్నాడట డార్లింగ్. అందుకే ఆయనతో మరో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఓ టాక్ ఉంది. ఇప్పుడు దాదాపుగా ప్రీక్వెల్ ఫిక్స్ అయినట్టేనని తెలుస్తోంది. అయితే ఫౌజీ రిజల్ట్‌ను బట్టి ఈ ప్రాజెక్ట్ ఉంటుందా?, ఉండదా? అనేది డిసైడ్ కానుంది. ఫౌజీ హిట్ అయితే ప్రీక్వెల్ ఉండే ఛాన్స్ ఉంది, లేదంటే లేదు. ఏదేమైనా ఫౌజీ మాత్రం మామూలుగా ఉండదనేది ఇండస్ట్రీ ఇన్‌సైడ్ టాక్. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. యుద్ధంలో పుట్టిన ప్రేమకథగా ఈ సినిమా ఉంటుందని ముందు నుంచి ప్రచారంలో ఉంది. మరి ఈసారి హను ఎలా ప్లాన్ చేస్తున్నాడో చూడాలి.

# మహిళలు బలహీనులు కాదు.. బలవంతులు


## నటి రష్మిక మందన్నా కామెంట్స్



ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో దూసుకెళ్తున్న హీరోయిన్ రష్మిక మందన్నా, భాష ఏదైనా పట్టించుకోకుండా వరుస సినిమా ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. అదే వేగంతో విజయాలు కూడా అందిపుచ్చుకుంటూ స్టార్ హీరో రేంజ్ ఫ్యాన్‌బేస్‌ను సంపాదించుకుంది. తాజాగా విడుదలైన 'గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న రష్మిక, సినిమాలకే కాకుండా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉండి అభిమానులతో కంటిన్యూ టచ్‌లో ఉంటుంది. ఇటీవల ఆమె స్త్రీశక్తి గురించి ఓ ఆసక్తికరమైన పోస్ట్‌ను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. అమ్మాయిలంతా ఏకమై నిలిస్తే ఆ శక్తిని ఎవరూ ఆపలేరని ఆమె స్పష్టంగా తెలిపింది. మహిళల మధ్య ఉండే భావోద్వేగ అనుబంధం వేరే స్థాయిలో ఉంటుందని, మంచి స్నేహితురాలితో దగ్గరైతే జరగబోయే విషయాలు ముందే అర్థమైపోతాయనే ఫీలింగ్ కలుగుతుందని చెప్పింది. స్త్రీలు ఒకరికొకరు మద్దతు ఇస్తే జీవితం మరింత సులభమవుతుందని, వారు బలహీనులు కాదు, ఎంతో ప్రేమతో, బలంతో ఉండే వ్యక్తులని రష్మిక పేర్కొంది. ఎల్లప్పుడూ తనతో ఉండే స్నేహితురాళ్లకు కృతజ్ఞతలు చెబుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో కూడా ఇలాంటి మంచి ఫ్రెండ్స్ ఉండాలని కోరుకుంటు న్నానని ఆమె

# సినిమాలో ఎఐ ట్రెండ్

## మహ్మాదన్ రఫీతో సోనూ నిగమ్ పాట



కృత్రిమ మేధ ఏఐ సంగీత రంగంలోనూ సరికొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేస్తోంది. ఏఐతో ఇప్పటి వరకూ దివంగత గాయకుల గొంతులను సినిమాల్లో వినిపించారు సంగీత దర్శకులు. ఇప్పుడీ ట్రెండ్‌ను గాయకుడు సోనూ నిగమ్ లైవ్ కాన్సర్ట్‌లోకి తెచ్చారు. లైవ్‌లో ఏఐ వినియోగించి దివంగత గాయకుడు మహమ్మద్ రఫీతో కలిసి డ్యుయెట్ పాడి ఔరా అనిపించారు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో సోనూ నిగమ్ కాన్సర్ట్ ఏర్పాటు చేశారు. అందులో రఫీకి సోనూ నిగమ్ అద్భుతమైన నివాళు లర్పించారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి రఫీతో గొంతుకలిపారు. స్క్రీన్‌పై రఫీ వీడియో, ఆయన గొంతు వినిపించడంతో అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఇది మరపురాని అనుభూతి' అని అభిమానులు పేర్కొనగా, 'ఏఐని సరిగ్గా ఉపయోగించారు. ఇది కొత్త ట్రెండ్' అంటూ పలువురు ప్రశంసలు కురిపించారు. 1924 డిసెంబరు 24న జన్మించిన ఆయన ఎన్నో భాషల్లో వేల పాటలు పాడి రికార్డులు సృష్టించారు. ఆయన బయోపిక్ తీసేందుకు బాలీవుడ్‌లో సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక సోనూ నిగమ్ హిందీతో పాటు దక్షిణాది చిత్రాల్లోనూ సూపర్ హిట్ సాంగ్స్‌తో అలరిస్తున్నారు.

# మోహన రాగ మ్యూజిక్ లాంచ్ చేసిన మంచుమనోజ్




టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ఆరంభించారు. ఈసారి సినీ సెట్‌లో కాదు? సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టారు. ఆయన కొత్త మ్యూజిక్ లేబుల్ 'మోహన రాగ మ్యూజిక్' శనివారం అధికారికంగా లాంచ్ అయింది. చాలా ఏళ్లుగా తన మనసులో దాగి ఉన్న ఈ కల నేడు నెరవేరిందని మనోజ్ భావోద్వేగంగా వెల్లడించారు. ట్విటర్‌లో 'మోహన రాగ మ్యూజిక్' పేరుతో ఓ సరికొత్త సంగీత సంస్థను ప్రారంభించబోతున్నట్టు చెప్పుకొచ్చారు మంచు మనోజ్. మ్యూజిక్ అంటే తనకు ఎంతో ఇష్టమని? ఈ సంస్థ ద్వారా న్యూ యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహించనున్నట్లు చెప్పుకొచ్చాడు. 'లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. సంగీతం ఎల్లప్పుడూ నా ఎస్కేప్. నా ఎక్స్‌ప్రెషన్, నా నిజం. ఈ రోజు ఆ జర్నీ డెవలప్ అవుతోంది. నా కొత్త ప్రపంచ మ్యూజిక్ వెంచర్ ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. మోహన రాగ మ్యూజిక్? యంగ్ టాలెంట్, కరేజ్, నిర్భయమైన సృజనాత్మక కోసం నిర్మించాం అని మంచు మనోజ్ స్పష్టం చేశాడు. నటుడిగా ఎన్నో సినిమాల్లో తనకంటూ ప్రత్యేకమైన మార్క్ సంపాదించిన మనోజ్, సంగీతంపై కూడా మంచి పట్టు ఉన్న సంగతి చాలా మందికి తెలియదు. పోటుగాడు సినిమాలో 'ప్యార్ మే పడిపోయా' పాటను స్వయంగా పాడారు. కరోనా సమయంలో విడుదల చేసిన 'అంతా బాగుంటాంద్రా' పాటకు విపరీతమైన స్పందన వచ్చింది అంతేకాదు పిస్తా పిస్తా, ఎన్నో ఎన్నో, ప్రాణం పోయే బాధ వంటి పాటలకు లిరిక్స్ కూడా రాశారు. అతని స్వరంలో ఉండే సహజమైన ఎమోషన్,
సంగీతాన్ని వ్యక్తీకరించే తీరు ప్రత్యేకమని ఆయన అభిమానులు అప్పుడప్పుడూ చెబుతుంటారు. మనోజ్ తండ్రి డాక్టర్ మంచు మోహన్ బాబు, అన్న మంచు విష్ణు, అక్క లక్ష్మీ మంచు సినిమాలకు సంగీతం, యాక్షన్ విభాగాల్లో కూడా పనిచేసిన విషయాన్ని మనోజ్ గుర్తుచేశారు. మోహన రాగ అనే పేరుకు తనకూ, తన కుటుంబానికీ ప్రత్యేకమైన అనుబంధం ఉందని తెలిపారు.

# వారణాసిలో మ్యూజిక్ అదుర్స్

## ఆరు పాటలుంటాయని హింట్ ఇచ్చిన కీరవాణి



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ట్రెండింగ్‌లో ఉన్న సినిమా 'వారణాసి'. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా తెరకెక్కుతోన్న ఈ యాక్షన్ అడ్వెంచర్ మూవీకి సంబంధించిన ప్రతి వార్త క్షణాల్లో వైరల్ అవుతోంది. ప్రజలు కూడా ఈ మూవీపై క్యూరియసిటీతో ఉన్నారు. తాజాగా చిత్ర సంగీత దర్శకుడు కీరవాణి ఈ సినిమాపై మ్యూజికల్ అప్‌డేట్ ఇచ్చారు. గోవా వేదికగా జరుగుతోన్న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి) వేడుకలకు హాజరైన కీరవాణి.. 'వారణాసి'లో సంగీతం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుందన్నారు. 'అభిమానులు ఈ చిత్రంలో అద్భుతమైన సంగీతాన్ని వింటారు. అంతకు మించి ఇప్పుడే ఈ ప్రాజెక్ట్ గురించి ఏం చెప్పలేను. 'వారణాసి'లో మొత్తం ఆరు పాటలు ఉంటాయి. మనం చేసే పని ఏదైనా కానీ.. దానిపై మనకు స్పష్టత, మనపై మనకు నమ్మకం ఉంటే ఏవిషయమూ గందరగోళంగా అనిపించదు. ఒత్తిడిగా కూడా ఉండదు. నాకు ఈ ప్రాజెక్ట్ విషయంలో ఎటువంటి గందరగోళం లేదని చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో 'రణ కుంభ' ఆడియో సాంగ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ సృష్టిస్తోంది. రాజమౌళి తెరకెక్కించే సినిమాలకు ఆయన సోదరుడు కీరవాణి సంగీతం అందిస్తారు. గతంలో వీరిద్దరి కాంబోలో వచ్చిన 'స్టూడెంట్ నెం.1', 'యమదొంగ', 'మగధీర', 'ఈగ', 'బాహుబలి'లోని పాటలు నేటికీ సోషల్‌మీడియా రీల్స్‌లో వైరల్ అవుతూనే ఉన్నాయి.
ఇక వీరి కాంబోలో వచ్చిన 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటను ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'వారణాసి'కి సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో పలు భాషలకు చెందిన అగ్రతారలు నటిస్తున్న నేపథ్యంలో దీని బ్జడెట్‌పై వార్తలు వెలువడుతున్నాయి. వీరికి భారీ పారితోషికం ఇవ్వనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇక ఈ చిత్రబ్జడెట్ ఏకంగా రూ.1100 కోట్లని ప్రచారం జరుగుతోంది. 2027 వేసవిలో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# పెళ్లి తర్వాత మరింత స్పీడ్..

## కొత్త ప్రయాణాన్ని మొదలు పెట్టబోతున్న కీర్తి సురేశ్





జాతీయ ఉత్తమ నటిగా గుర్తింపు పొందిన కీర్తి సురేశ్ తన కెరీర్‌లో మరో కీలక అడుగు వేయడానికి సిద్ధమవుతున్నారు. నటిగా ఉన్నత స్థాయిలో రాణిస్తున్న ఆమె, ఇప్పుడు దర్శకత్వం వైపు దృష్టి సారించారు. తాను సొంతంగా ఓ స్క్రిప్ట్ రాస్తున్నట్లు తాజాగా వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'రివాల్వర్ రీటా' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ ఆసక్తికర విషయాన్ని బయటపెట్టారు. పెళ్లి తర్వాత హీరోయిన్ల కెరీర్ నెమ్మదిస్తుందనే అభిప్రాయాన్ని కీర్తి సురేశ్ పూర్తిగా మార్చేశారు. వివాహం తర్వాత కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తాను మహానటిగా వెండితెరపై ఆవిష్కరించిన సావిత్రి కూడా దర్శకురాలు కావడం, ఇప్పుడు కీర్తి కూడా అదే బాటలో పయనించాలని అనుకోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నటిస్తూనే దర్శకత్వం చేయడం అంత సులభం కాకపోయినా, ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇదే సమయంలో తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ, తన భర్త సినిమాల్లోకి వచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. "ఆయనకు నటనపై ఆసక్తి లేదు, నాతో నటించే ఛాన్స్ లేదు" అని నవ్వుతూ చెప్పారు. ఇదిలా ఉండగా, ఇటీవల తనను, నటి సమంతను లక్ష్యంగా చేసుకుని వచ్చిన డీప్‌ఫేక్ వీడియోపై కీర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సైబర్ నేరాల నుంచి మహిళలను కాపాడేందుకు విదేశాల్లో ఉన్నట్లుగా మన దేశంలోనూ కఠినమైన చట్టాలు తీసుకురావాలని ఆమె డిమాండ్ చేశారు.